శుక్రవారం
FRIDAY
13-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 134

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక





రష్యా-ఉక్రెయిన్ శాంతికి అమెరికా రాయబారం

మాస్కో: రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా మరో అడుగు ముందుకేసింది. ట్రంప్ ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్కాఫ్, కుష్నర్ గురువారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యారు. ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధి బృందాలతో అబుధాబీలో వారు రెండు రోజుల పాటు చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య శాంతి ప్రయత్నాలు నిలిచిపోయిన 9 నెలల తర్వాత ఆయా దేశాల ప్రతినిధులు ప్రత్యక్షంగా చర్చలు జరపడం ఇదే తొలిసారి. బుధవారం చర్చలు ముగియగా..గురువారం నేరుగా క్రెమ్లిన్ చేరుకున్న అమెరికా రాయబార బృందం దాదాపు 2 గంటలపాటు పుతిన్‌తో తరువాయి 2 వ పేజీలో...



అలీస్ హువాంగ్‌పై సింగపూర్ నిషేధం

సింగపూర్: చైనా గూఢచారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అలీస్‌ను తమ దేశంలోకి తిరిగి రాకుండా నిషేధించినట్లు సింగపూర్ హోంశాఖ తెలిపింది. సర్వర్ కొనుగోళ్లకు సంబంధించి మెగాస్పీడ్ సంస్థ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు ఆరోపణలు రావడం, వీటిపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సర్వర్ల కొనుగోలుకు సంబంధించి వాటిని సింగపూర్ నుంచి మలేసియాకు ఎగుమతి చేసి, అక్కడ నుంచి తుది గమ్యస్థానానికి మళ్లించారా? అనే కోణంలో సింగపూర్ పోలీసులు గతంలోనే దర్యాప్తు చేపట్టారు. అప్పట్లో ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్న అధికారులు.. తరువాయి 2 వ పేజీలో...

‘వికసిత్’వైపు వడివడిగా..!

2047 అనేది డెడ్‌లైన్ కాదు

అంతకుముందే లక్ష్యాన్ని చేరాలి.. నిరంతర ప్రగతి టార్గెట్ కావాలి

దీపావళి మిలన్ సమారోహ్‌లో ప్రధాని మోదీ



2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడం మనకు పూర్తిగా అందుబాటులోనే ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. దేశం సాధించిన విజయాలే ఇందుకు నిదర్శనమన్నారు. 2047ను చేరుకోవాల్సిన గడువుగా కాకుండా, అభివృద్ధి దిశగా నిరంతరం ముందుకు సాగాల్సిన మార్గంగా చూడాలని సూచించారు. గురువారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన దీపావళి మిలన్ సమారోహ్‌లో ఆయన మాట్లాడారు.

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు. సాంకేతికత, మౌలిక సదుపాయాల రంగాల్లో భారత్ సాధించిన ప్రగతిని మోదీ ఈ సందర్భంగా వివరించారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను దింపడం, ప్రపంచంలో రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా ఎదగడం, మూడో అతిపెద్ద అంకుర సంస్థల వ్యవస్థను నిర్మించుకోవడం దేశ సామర్థ్యానికి తరువాయి 2 వ పేజీలో...

టిమ్స్‌కు డెడ్‌లైన్

జూన్ 2 నాటికి పూర్తి స్థాయి సేవలందించాలి

ఏడాదిలో ఉస్మానియా సేవలు ప్రజలకు అందాలి.. 3 టిమ్స్‌లకు ఏకీకృత నియామకాలు

వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేయండి.. వైద్యారోగ్యశాఖ సమీక్షలో సీఎం రేవంత్



వచ్చే ఏడాది జూన్ 2 నాటికి అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణాన్ని వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గురువారం ఎంసీఆర్‌హెచ్ ఆర్‌డీలో వైద్యారోగ్యశాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): ఆసుపత్రుల నిర్మాణ పనులతో పాటు అవసరమైన వైద్య పరికరాల కొనుగోలు, వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలను ఏకకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకాలకు ఏకీకృత విధానం పాటించాలని, వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు ఆసుపత్రుల మధ్య బదిలీలు చేపట్టాలని చెప్పారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్‌కీపింగ్ బాధ్యతలను ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సీఎం సూచించారు. టిమ్స్ పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను, హౌస్‌కీపింగ్ సిబ్బంది పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామని తెలిపారు. నిర్వహణ బాధ్యతల నుంచి తరువాయి 2 వ పేజీలో...



సీఈవో అవుట్

తన పదవికి జెన్సన్ హువాంగ్ రాజీనామా

తాత్కాలిక సీఈవోగా కొలెట్ క్రాస్ నియామకం

7.5 బిలియన్ డాలర్ల చిప్‌ల తరలింపుపై ఎఫ్‌బీఐ దర్యాప్తు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవంలో ప్రపంచ అగ్రగామిగా దూసుకుపోతున్న ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియాలో తీవ్ర సంక్షోభం తలెత్తింది. సంస్థ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) జెన్సన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. చైనా గూఢచారిగా భావిస్తున్న ఆలిస్ హువాంగ్ తో ఆయన వివాహేతర సంబంధం నేపథ్యంలో.. వివాదాలు ముదరడంతో డైరెక్టర్ల బోర్డు ఆయనపై చర్యలకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే, బోర్డు నిర్ణయం కంటే ముందే జెన్సన్ హువాంగ్ రాజీనామా నిర్ణయం తీసుకున్నారు.

న్యూయార్క్: ఆయన స్థానంలో కంపెనీ తాత్కాలిక సీఈవోగా కొలెట్ క్రాస్ బాధ్యతలు చేపట్టారు. ఈ పరిణామాలకు దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తే.. నవంబర్ 8న జెన్సన్ హువాంగ్ తాను భార్యకు నమ్మకద్రోహం చేశానని సంస్థ ఉద్యోగులకు స్వయంగా వెల్లడించారు. అయితే ఇందులో విదేశీ నిఘా ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో బోర్డులోని స్వతంత్ర డైరెక్టర్లు విచారణ ప్రారంభించారు. ఎన్విడియా క్లయింట్ అయిన సింగపూర్ -2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.13,980
వెండి (కిలో):	రూ.2,00,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,611

విశ్వవాణి



ఆహారం తీసుకోవడం ఆపినప్పుడు శరీరం శక్తి కోసం ఉపయోగించే ఇంధన వనరులను మార్చుకుంటుంది. మొదటి కొన్ని రోజుల్లో కాలేయం, కండరాల్లో నిల్వ ఉన్న గ్లూకోజ్ ప్రాధాన్యం తగ్గుతుంది. దానికి బదులుగా శరీరం కొవ్వును విచ్ఛిన్నం చేసి శక్తిని ఉత్పత్తి చేసుకోవడం పెంచుతుంది. అయితే ఏడు రోజుల పాటు నీళ్లు మాత్రమే తాగుతూ ఉపవాసం చేసిన వారిపై నిర్వహించిన అధ్యయనంలో.. ఈ మార్పుల కంటే లోతైన జీవసంబంధ పరిణామాలు ఆ తర్వాతే చోటుచేసుకుంటున్నట్లు గుర్తించారు. రక్త పరీక్షల్లో పరిశీలించిన ప్రోటీన్లలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ ప్రోటీన్ల స్థాయుల్లో గణనీయమైన మార్పులు కనిపించాయి.

ఫైర్ డీజీగా సజ్జనార్

హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్

లా అండ్ ఆర్డర్ ఏడీజీపీగా అకున్ ఎంట్రీ

పోలీస్ శాఖలో కీలక మార్పులు

21 మంది సీనియర్ ఐపీఎస్‌ల బదిలీ



హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది సీనియర్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. లా అండ్ ఆర్డర్, ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్ విభాగాల్లో సమూల మార్పులు చేస్తూ పోస్టింగ్‌లు కేటాయించారు. ఈ బదిలీల్లో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త సారథి వచ్చారు. ఇప్పటివరకు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న మహేశ్ మురళీధర్ భగవత్‌ను తరువాయి 2 వ పేజీలో...

సజ్జనార్ న్యాయం చేసేనా?



ఫైర్ సిబ్బంది పదోన్నతులపై పరిష్కారం దక్కేనా?

‘జీవో 86’ రద్దు కోరుతూ ఫైర్ ఫైటర్ల డిమాండ్

(ఈవార్తలు - స్పెషల్ డెస్క్)

తెలంగాణ అగ్నిమాపక శాఖలో జీవో 86 వివాదం మరోసారి తెరపైకి వస్తోంది. ఈ జీవో కారణంగా పదోన్నతులు, సర్వీసు సీనియారిటీ, ఇంక్రిమెంట్ల విషయంలో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఫైర్ సిబ్బందికి కొత్త డీజీ అయినా న్యాయం చేస్తారా? అన్న చర్చ ఉద్యోగ వర్గాల్లో మొదలైంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన వీసీ సజ్జనార్‌ను ప్రభుత్వం తాజాగా తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డీజీగా నియమించడంతో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఉద్యోగులు ఆశిస్తున్నారు. 2025 జులై 11న ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 86 ద్వారా ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగానికి సంబంధించి కొత్త సర్వీస్ నిబంధనలు తీసుకొచ్చింది. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టుల భర్తీ, పదోన్నతులకు సంబంధించి కొత్త అర్హతలు, శిక్షణ, పరీక్షలు, హెవీ తరువాయి 2 వ పేజీలో...

బ్యాంకు ఖాతా లేకున్నా.. రూ.50 వేలు ట్రాన్స్‌ఫర్

ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు.. నెఫ్ట్ ద్వారా డబ్బు పంపేందుకు వీలు

ఏటీఎం, బ్యాంకు ప్రతినిధుల ద్వారా రూ.5 వేలు



న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతా లేని వ్యక్తులు నగదు రూపంలో ఇతరుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు పంపాలంటే ఎంత పంపొచ్చు? ఏటీఎం లేదా బ్యాంకు ప్రతినిధుల ద్వారా డబ్బు పంపితే పరిమితి ఎంత? ఇలాంటి అంశాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) స్పష్టమైన నిబంధనలు జారీ చేసింది. గతంలో ఉన్న నగదు బదిలీ పరిమితులను కొనసాగిస్తూనే, మోసాలను అరికట్టేందుకు కొన్ని భద్రతా చర్యలను తప్పనిసరి చేసింది. ఒక వ్యక్తికి బ్యాంకు ఖాతా లేకపోయినా, బ్యాంకు శాఖకు వెళ్లి నగదు రూపంలో ఇతరుల ఖాతాలో డబ్బు జమ చేయవచ్చు. ఇందుకు నెఫ్ట్ సేవను ఉపయోగించుకోవచ్చు. -2 వ పేజీలో...



ఇరిగేషన్ డీఈఈ ఆస్తులు రూ.100 కోట్లు!

10 ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ సోదాలు

రూ.7 కోట్ల అక్రమ ఆస్తులు గుర్తింపు

25 ఎకరాల భూమి, 50 తులాల బంగారం, 4 ఇళ్ల పత్రాలు స్వాధీనం

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో ఇరిగేషన్ అండ్ క్యాడ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ) ఆర్.సత్యనారాయణ (44) నివాసంతో -2 వ పేజీలో...

కేఎఫ్‌సీలో నూనె రీయూజ్

డొమినోస్ అవుట్‌లెట్లలోనూ ఇదే దుస్థితి.. నూనె శుద్ధికి మెగ్నీషియం సిలికేట్ వాడకం!

గుర్తించిన టీజీ సేఫ్ అధికారులు.. పలు అవుట్‌లెట్ల లైసెన్సులు సస్పెండ్



హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): వంటగదుల్లో దుర్వాసన కూడా వెలువడుతున్నట్లు అధికారులు గుర్తించారు. వాడిన నూనెను తిరిగి వినియోగించేందుకు అనధికారికంగా సింథటిక్ మెగ్నీషియం సిలికేట్ రసాయనాన్ని ఉపయోగిస్తున్నట్లు వెల్లడైంది. అనుమానిత కల్తీకి సంబంధించి 20 నమూనాలను సేకరించడంతోపాటు 52 కిలోల మెగ్నీషియం సిలికేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. తీవ్ర ఉల్లంఘనలకు సంబంధించి మూడు డొమినోస్, రెండు కేఎఫ్‌సీ అవుట్‌లెట్లతోపాటు మొత్తం ఐదు బ్రాంచ్‌లకు షోకాజ్ తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు

13.11.2026

మేషం: బంధువుల నుండి వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వాహన ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. విద్యా విషయాలు నిరాశ కలిగిస్తాయి.

వృషభం: అన్నివైపుల నుండి ఆదాయం అందుతుంది. ఇంటా బయట సంతోషకర వాతావరణం ఉంటుంది. నూతన వస్త్రా వస్తు లాభాలు పొందుతారు. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. వాహన యోగం ఉన్నది. సంతాన విద్యా ఉద్యోగ విషయాలలో శుభవార్తలు అందుతాయి.

మిథునం: వృత్తి వ్యాపారాలలో సరైన నిర్ణయం తీసుకోలేరు. మానసికంగా ఆలోచనలు ఇబ్బందికి గురిచేస్తాయి. చిన్ననాటి మిత్రులతో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృధా ఖర్చులు చేస్తారు.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారు. ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు. ఉద్యోగమున నూతన అవకాశములు అందుతాయి. నిరుద్యోగుల కష్టం ఫలిస్తుంది. కుటుంబ విషయంలో నూతన ఆలోచనలు అమలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉంటుంది.

సింహం: వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభించదు. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. కుటుంబమున కొంతమంది ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. భాగస్వామ్య వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

కన్య: వృత్తి ఉద్యోగాలలో ఉన్నత పదవులు పొందుతారు. ఆర్థిక పరమైన చిక్కులు నుండి బయటపడతారు. వ్యాపారాలలో అంచనాలను దాటి లాభాలు అందుతాయి. నూతన కార్యక్రమాల ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులను పూర్తిచేస్తారు.

తుల: బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో పూర్తిచేస్తారు. ధనపరంగా ఇబ్బందులను అధిగమించి ఋణాలు సైతం తీర్చగలుగుతారు. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

వృశ్చికం: వృత్తి ఉద్యోగాలలో మేలైన సౌకర్యాలను పొందుతారు. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. వ్యాపారాలు అనుకూలిస్తాయి. నూతన ఉద్యోగ అవకాశాలు అందుతాయి. భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

ధనస్సు: అనుకున్న సమయానికి పనులు పూర్తికావు. శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. బంధు మిత్రులతో చిన్న చిన్న తగాదాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇతరులపై మీ ఆలోచనా విధానం మార్చుకోవడం మంచిది.

మకరం: ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. నూతన వస్తు వాహన సౌకర్యాలు లభిస్తాయి. ఆర్థిక పరంగా చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. దూర ప్రయాణ సూచనలున్నవి. ధనాదాయం పెరుగుతుంది. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది.

కుంభం: సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుకుంటారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో పెద్దల సలహాలను తీసుకోవడం మంచిది. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

మీనం: ప్రారంభించిన పనులు మందకొడిగా సాగుతాయి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉండి శిరోబాధలు పెరుగుతాయి. ధన విషయాలలో ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు.

టీమ్స్‌కు డెడ్‌లైన్

మొదటి పేజీ తరువాయి

వైద్యులను మినహాయిస్తే వారు పూర్తిగా వైద్య సేవలపై దృష్టి సారించగలరని పేర్కొన్నారు. నిమ్స్‌లో శస్త్రచికిత్సలకు ఎక్కువ సమయం పడుతున్న నేపథ్యంలో సనత్‌నగర్ టిమ్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. నిమ్స్‌లో పడకలు అందుబాటులో లేకపోయినా, శస్త్రచికిత్సలకు జాప్యం జరిగినా సనత్‌నగర్ టిమ్స్‌లో సేవలు అందించాలని సూచించారు. ఈ రెండు ఆసుపత్రుల డైరెక్టర్లు, వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. టిమ్స్‌లో వైద్యుల నియామకాలు పూర్తయ్యే వరకు అవసరమైన వైద్యులను బయట నుంచి నియమించుకోవాలని, ఇందుకు కావాల్సిన నిధులు వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కొత్తగా 16 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్న మరో 79 కేంద్రాల పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది విధులకు హాజరయ్యే, వెళ్లే సమయాలను నమోదు చేయాలని, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయడంతో పాటు కృత్రిమ మేధతో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు సీఎం గుర్తు చేశారు. మూడేళ్లలో 9 వైద్య కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని, మరో 5,640 నియామకాలు కొనసాగుతున్నాయని వివరించారు. మూడేళ్లలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్య 30 వేల నుంచి 38 వేలకు పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇదే సమయంలో ఔటోపేషెంట్ల సంఖ్య 7 కోట్ల నుంచి 9 కోట్లకు, ఇన్‌పేషెంట్ల సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరిగినట్లు తెలిపారు. ఈ గణాంకాలపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో గతంలో ఆరోగ్య రంగానికి సగటున 3.9 శాతం నిధులు కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తూ వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. సమీక్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్తూ, టీజీఎంఎస్ఐడీసీ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, శాఖ కమిషనర్ ముష్రఫ్ అలీ ఫారూఖీ, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి ఇలంబరితి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కేఎఫ్‌సీలో నూనె రీయూజ్

మొదటి పేజీ తరువాయి

నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించారు. ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమించే పరిస్థితులు ఉన్నాయని గుర్తించి మరో తొమ్మిది అవుట్‌లెట్ల లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. వీటిలో మియాపూర్, సింధి కాలనీ (సికింద్రాబాద్), పంచ్ మొహల్లా (చార్మినార్), మూసారాంబాగ్, బంజారాహిల్స్, శిల్పకళావేదిక, ఇనార్బిట్ మాల్‌లోని కేఎఫ్‌సీ అవుట్‌లెట్లు ఉన్నాయి. అలాగే కొండాపూర్‌లోని శరత్ సిటీ మాల్, ఇనార్బిట్ మాల్‌లోని డొమినోస్ పిజ్జా అవుట్‌లెట్ల లైసెన్సులను కూడా సస్పెండ్ చేశారు.

ఎన్విడియా సీఈవో అవుట్

మొదటి పేజీ తరువాయి



సంస్థ మెగాస్పీడ్ ఎగ్జిక్యూటివ్ ఆలిస్ హువాంగ్‌తో ఆయనకున్న సంబంధం ఈ వివాదానికి కేంద్రబిందువుగా మారింది. ఆమె చైనా నిఘా వర్గాలకు ఏజెంట్‌గా వ్యవహరిస్తూ, అమెరికా నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 7.5 బిలియన్ డాలర్ల విలువైన ఏఐ చిప్‌లను చైనాకు చేరవేయడంలో ఈ సంబంధాన్ని ఉపయోగించుకున్నారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై ఇప్పటికే ఎఫ్‌బీఐ, అమెరికా న్యాయశాఖ విచారణ జరుపుతున్నాయి. మొదట్లో హువాంగ్‌కు అండగా నిలిచిన బోర్డు, ఆ తర్వాత ఆయనపై మరో వ్యక్తిగత వివాదం తెరపైకి రావడంతో వైఖరి మార్చుకుంది. ఎన్విడియా వైస్ ప్రెసిడెంట్ (హెల్త్‌కేర్) కింబర్లీ పావెల్‌తో కూడా ఆయనకు సంబంధం ఉన్నట్లు నివేదికలు రావడంతో డైరెక్టర్ల బోర్డు అత్యవసరంగా భేటీ అయింది. సంస్థ నియమావళి, జాతీయ భద్రత, కార్పొరేట్ విశ్వసనీయత దెబ్బతిన్న నేపథ్యంలో బోర్డు తొలగింపునకు సిద్ధం కావడంతో హువాంగ్ తప్పుకోవాల్సి వచ్చింది. సంస్థలో ఇప్పటివరకు ఎలాంటి వారసత్వ ప్రణాళిక లేకపోవడంతో, ఆర్థిక వ్యవహారాల్లో కీలకమైన కొలెట్ క్రాస్‌ను తాత్కాలిక సీఈవోగా నియమించారు. ఈ నాయకత్వ సంక్షోభం వాల్‌స్ట్రీట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేసింది. బుధవారం సాధారణ ట్రేడింగ్‌లో 173.73 డాలర్ల వద్ద ముగిసిన ఎన్విడియా షేరు, తాజా పరిణామాల అనంతరం ఆఫ్టర్-అవర్స్ ట్రేడింగ్‌లో దాదాపు 8.6 శాతం పతనమై 158.78 డాలర్లకు పడిపోయింది. వివాదం మొదలైన నవంబర్ 8 నుంచి ఇప్పటివరకు కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 430 నుంచి 600 బిలియన్ డాలర్ల మేర సంపద ఆవిరైంది. ఇదే సమయంలో ఎన్విడియా ప్రత్యర్థి సంస్థలైన ఏఎండీ, బ్రాడ్‌కామ్ షేర్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి. మరోవైపు ఈ సంక్షోభం రాజకీయ, న్యాయపరమైన మలుపులు తిరుగుతోంది. నష్టపోయిన మదుపర్లు శాన్ జోస్ కోర్టులో క్లాస్ యాక్షన్ దావా వేశారు. చైనాకు చిప్‌ల తరలింపు వ్యవహారంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గతంలోనే సమాచారం ఉన్నట్లు వార్తలు రాగా, ఆయన దానిని తోసిపుచ్చారు. కాంగ్రెస్ సభ్యులు ఎలిజబెత్ వారెన్, క్రిస్ కూన్స్ తదితరులు ఎన్విడియా రికార్డులను భద్రపరచాలని, ఈ వ్యవహారంపై కాంగ్రెస్‌కు సమగ్ర వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. దశాబ్దాలుగా ఎన్విడియాను తిరుగులేని సాంకేతిక శక్తిగా నిలబెట్టిన జెన్సన్ హువాంగ్ ఒక్కసారిగా పదవీచ్యుతుడు కావడం ప్రపంచ టెక్ రంగాన్ని తీవ్ర విస్మయానికి గురిచేసింది.

ఇరిగేషన్ డీఈఈ ఆస్తులు రూ.100 కోట్లు!

మొదటి పేజీ తరువాయి

పాటు ఆయనకు సంబంధించిన పలు ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు కావడంతో 10 ఏసీబీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని బైరామల్‌గూడ మాధవరం సెరెనిటీ గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న ఆయన నివాసంతో పాటు మొత్తం 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు సుమారు రూ.7 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ డీఎస్పీ చలపతి వెల్లడించారు. 25 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు, 50 తులాల బంగారు ఆభరణాలు, వివిధ ప్రాంతాల్లో నాలుగు ఇళ్లకు సంబంధించిన వివరాలు గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.7 కోట్లు కాగా, బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ సుమారు రూ.100 కోట్ల వరకు ఉండవచ్చని పేర్కొన్నారు. మిగిలిన తొమ్మిది ప్రాంతాల్లోనూ తనిఖీలు కొనసాగుతున్నాయని, సోదాలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

రష్యా-ఉక్రెయిన్ శాంతికి అమెరికా రాయబారం

మొదటి పేజీ తరువాయి

సమావేశమైంది. చర్చల సారాంశాన్ని ఆయనకు వివరించింది. శాంతి ఒప్పందం కుదుర్చుకోవాల్సిన అవసరాన్ని చెప్పింది. అక్కడి నుంచి వారు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమయ్యేందుకు ఐర్లాండ్ వెళ్లనున్నారు. చర్చల ఫలితంగా రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధి బృందాలు అనేక అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చినప్పటికీ.. కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయలు ఉన్నట్లు కుష్నర్ మీడియాకు వెల్లడించారు. మాస్కోతో చర్చలు జరిపేందుకు యూరప్ దేశాల తరఫున ఒకే ప్రతినిధిని నియమించాలని అమెరికా, జెలెన్‌స్కీ కోరుకుంటున్నారు. కానీ, యూరోపియన్ దేశాలతో ప్రత్యక్ష చర్చల్లో పాల్గొనేందుకు పుతిన్ ఆసక్తి చూపడం లేదు.

అలిస్ హువాంగ్‌పై సింగపూర్ నిషేధం

మొదటి పేజీ తరువాయి

నేరాలకు పాల్పడినట్లు ఆధారాలు లేకపోవడంతో తిరిగి ఇచ్చారు. అప్పుడు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు అనుమానించిన అధికారులు ఆమెను తిరిగి దేశంలోకి రావద్దని హెచ్చరించారు. తమ దేశంతో ఉన్న సంబంధాలను ఉపయోగించుకొని.. ఉల్లంఘించే, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే కంపెనీలను సహించమని ఈ సందర్భంగా సింగపూర్ స్పష్టం చేసింది.

'వికసిత్'వైపు వడివడిగా..!

మొదటి పేజీ తరువాయి

నిదర్శనమన్నారు. యూపీఐ ప్రపంచంలోనే అతిపెద్ద తక్షణ చెల్లింపుల వ్యవస్థగా నిలిచిందని పేర్కొన్నారు. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెన నిర్మాణాన్ని కూడా ప్రస్తావించారు. 12 ఏళ్ల క్రితం నాలుగు వరుసల రహదారి నిర్మాణమే పెద్ద విజయంగా భావించేవారని మోదీ గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న తొలినాళ్లలో గ్రామాలకు వెళ్లినప్పుడు కనీసం ఒక రహదారైనా నిర్మించాలని ప్రజలు వినతిపత్రాలు ఇచ్చేవారని చెప్పారు. ఇప్పుడు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు. పేదరిక నిర్మూలనపై మాట్లాడుతూ.. గతంలో ప్రతి ఎన్నికల్లో పేదరికాన్ని నిర్మూలిస్తామని హామీలు ఇచ్చేవారని, ఇప్పుడు పేదలు స్వయంగా పేదరికం నుంచి బయటపడుతున్నారని మోదీ పేర్కొన్నారు. దేశంలో పేదరికం తగ్గుముఖం పడుతోందని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని వికసిత భారత్ లక్ష్యంతో పోల్చిన ప్రధాని.. సంపూర్ణ స్వాతంత్ర్యం ఒక్కరోజులో సాధ్యం కాలేదన్నారు. చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, అదే స్ఫూర్తితో వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. దేశ విజయాలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని మోదీ కోరారు.

ఫైర్ డీజీగా సజ్జనార్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ సీపీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా (డీజీ) బదిలీ చేశారు. ఆయనకు అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డీజీ బాధ్యతలను కూడా అప్పగించారు. అలాగే రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్ నియమితులయ్యారు. ఆయనకు కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల బాధ్యతలను కూడా ప్రభుత్వం కేటాయించింది.

బదిలీ అయిన 21 మంది ఐపీఎస్‌లు – కొత్త బాధ్యతలు:

1. మహేశ్ మురళీధర్ భగవత్ (1995 బ్యాచ్): హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్
2. వీసీ సజ్జనార్: డీజీ (తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్), ఎస్పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు
3. డా. సౌమ్య మిశ్రా (1994 బ్యాచ్): డీజీపీ (మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా), ఏడీజీపీ (ఆర్గనైజేషన్ అండ్ లీగల్)గా అదనపు బాధ్యతలు
4. స్వాతి లక్రా (1995 బ్యాచ్): జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్, హోంగార్డ్స్ డీజీపీగా అదనపు బాధ్యతలు
5. చారు సిన్హా (1996 బ్యాచ్): ఏసీబీ డైరెక్టర్ జనరల్, సీఐడీ డీజీపీగా అదనపు బాధ్యతలు
6. డా. అనిల్ కుమార్ (1996 బ్యాచ్): టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్
7. వై. నాగిరెడ్డి (1997 బ్యాచ్): పౌరసరఫరాల శాఖ కమిషనర్ అండ్ ఎక్స్-అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ, లీగల్ మెట్రాలజీ
8. విక్రమ్ సింగ్ మాన్ (1998 బ్యాచ్): గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ డీజీపీ (ఆపరేషన్స్), పోలీస్ హౌసింగ్ విభాగం
9. ఎం. స్టీఫెన్ రవీంద్ర (1999 బ్యాచ్): టీజీ-టీఎంఏఆర్ఎస్ డైరెక్టర్
10. అకున్ సబర్వాల్ (2001 బ్యాచ్): అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్), కోఆర్డినేషన్ అండ్ టెక్నికల్ సర్వీసెస్
11. సంజయ్ కుమార్ జైన్: అదనపు డీజీపీ (ట్రైనింగ్) – అదనపు బాధ్యతలు
12. ఎస్. చంద్రశేఖర్ రెడ్డి (2004 బ్యాచ్): డైరెక్టర్, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)
13. కార్తికేయ (2006 బ్యాచ్): ఐజీ (మల్టీ జోన్-1), ఐసీసీసీ డైరెక్టర్
14. కె. రమేష్ నాయుడు (2006 బ్యాచ్): రైల్వేస్ ఐజీ
15. డి. జోయల్ డేవిస్ (2010 బ్యాచ్): టీజీ-టీఎంఏఆర్ఎస్ రోడ్ సేఫ్టీ అండ్ ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా అదనపు బాధ్యతలు
16. జి. చందన దీప్తి (2012 బ్యాచ్): జోన్-7 (జోగులాంబ/గద్వాల) డీఐజీగా అదనపు బాధ్యతలు
17. ఆర్. భాస్కరన్ (2012 బ్యాచ్): డీఐజీ (ఇంటెలిజెన్స్)
18. కె. నారాయణ నాయక్ (2009 బ్యాచ్): జోన్-2 (బాసర) డీఐజీగా అదనపు బాధ్యతలు
19. ఎల్.ఎస్. చౌహాన్ (2009 బ్యాచ్): డీఐజీ (కోఆర్డినేషన్), జోన్-6 డీఐజీగా అదనపు బాధ్యతలు
20. శ్రీబాలా దేవి: టీజీ-టీఎంఏఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్)
21. వి అరవింద బాబు: హైదరాబాద్ సిటీ డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)

సజ్జనార్ న్యాయం చేసేనా?

మొదటి పేజీ తరువాయి

మోటార్ వెహికల్ (హెచ్ఎంవీ) డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలను ఇందులో పొందుపరిచారు. అయితే ఈ నిబంధనలు ఇప్పటికే విధుల్లో ఉన్న సిబ్బందిపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్న విషయంలో వివాదం మొదలైంది. ముఖ్యంగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ఫైర్‌మెన్‌లు తమ సర్వీసు అనుభవం, సీనియారిటీకి తగిన ప్రాధాన్యం దక్కడం లేదని వాదిస్తున్నారు. గతంలో అమల్లో ఉన్న పదోన్నతి విధానంలో తమకు లభించాల్సిన అవకాశాలు కొత్త నిబంధనలతో తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్లకు అన్యాయం జరుగుతోందా?

1986, 1990, 1991 బ్యాచ్‌లకు చెందిన లీడింగ్ ఫైర్‌మెన్‌లతో పాటు 2011, 2013, 2014, 2017, 2020, 2024 బ్యాచ్‌లకు చెందిన ఫైర్‌మెన్‌లు ఈ నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమకంటే జూనియర్లు పదోన్నతులు పొందే పరిస్థితులు ఏర్పడుతున్నాయని కొందరు సిబ్బంది చెబుతున్నారు. నియామక సమయంలో హెచ్ఎంవీ లైసెన్స్ తప్పనిసరి అర్హతగా లేకపోయినా, ప్రస్తుతం ఆ నిబంధనను ముందుకు తీసుకురావడం వల్ల పాత సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. లైసెన్స్ నిబంధన కారణంగా ఇంక్రిమెంట్లు నిలిచిపోవడం, సీనియారిటీకి తగిన గుర్తింపు దక్కకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని వారి వాదన. మరోవైపు డ్రైవర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కూడా తమ సర్వీసుకు తగిన గుర్తింపు, పదోన్నతి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. కేవలం డ్రైవింగ్ బాధ్యతలకే పరిమితం చేయకుండా తమ అనుభవం, అర్హతలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గత డీజీ ఇచ్చిన హామీ ఏమైంది?

ఈ వివాదంపై గతంలో అప్పటి ఫైర్ డీజీ విక్రమ్‌సింగ్ ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి జిల్లా నుంచి ఒక ఫైర్‌మెన్, ఒక లీడింగ్ ఫైర్‌మెన్, ఒక డ్రైవర్ ఆపరేటర్ చొప్పున అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఉద్యోగుల్లో సుమారు 98 శాతం మంది జీవో 86 వల్ల తమకు నష్టం జరుగుతోందని అభిప్రాయపడినట్లు అప్పట్లో వెల్లడైంది. పదోన్నతి అనేది ప్రతి ఉద్యోగి హక్కు అని, ఉద్యోగులు సంతోషంగా పదవీ విరమణ చేసేలా పదోన్నతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అప్పటి డీజీ పేర్కొన్నట్లు ఉద్యోగులు గుర్తుచేస్తున్నారు. జీవో 86 వల్ల సమస్యలు ఏర్పడితే న్యాయం చేస్తామని, అవసరమైతే జీవోను పునఃపరిశీలిస్తామని కూడా హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే ఆ హామీకి అనుగుణంగా స్పష్టమైన ప్రభుత్వ నిర్ణయం వెలువడిందా? బాధిత ఉద్యోగులకు ఏమైనా ఉపశమనం లభించిందా? అన్నది ఇప్పటికీ కీలక ప్రశ్నగానే ఉంది.

సజ్జనార్ ముందున్న సవాలు

ఇప్పుడు కొత్తగా బాధ్యతలు చేపట్టిన సజ్జనార్ ముందు ఈ సమస్య పరిష్కారం ఒక ముఖ్యమైన అంశంగా మారింది. గతంలో ఉద్యోగులు వెల్లడించిన అభ్యంతరాలు, పదోన్నతుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, సర్వీసు సీనియారిటీ, ఇంక్రిమెంట్ల అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని సిబ్బంది కోరుతున్నారు. ముఖ్యంగా జీవో 86 అమలుకు ముందు నియమితులైన ఉద్యోగుల సర్వీసు పరిస్థితులను ప్రత్యేకంగా పరిశీలించి, వారి నియామక సమయంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం వారికి దక్కాల్సిన ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొత్త నిబంధనలు భవిష్యత్తులో నియమితులయ్యే సిబ్బందికి వర్తింపజేసే విషయంలోనూ, ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడాలని కోరుతున్నారు. అంతేకాకుండా జీవో 86లోని నిబంధనలను సమీక్షించేందుకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని, బాధిత ఉద్యోగుల నుంచి వ్యక్తిగతంగా వినతులు స్వీకరించాలని కోరుతున్నారు. గతంలో ఇచ్చిన హామీల అమలు స్థితిని కూడా సమీక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఖాతా లేకున్నా రూ.50 వేలు ట్రాన్స్‌ఫర్

మొదటి పేజీ తరువాయి

ఇలా ఒక వ్యక్తి గరిష్ఠంగా రూ.50 వేల వరకు నగదు పంపవచ్చు. ఈ పరిమితిని ఆర్బీఐ కొనసాగించింది. బ్యాంకు ఖాతా లేని వ్యక్తులు బిజినెస్ కరస్పాండెంట్లు (బ్యాంకు తరఫున గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో సేవలందించే ప్రతినిధులు), ఏటీఎంలు లేదా అనుమతించిన ఇతర మార్గాల ద్వారా కూడా డబ్బు పంపవచ్చు. అయితే ఈ విధానంలో ఒక్కసారి రూ.5 వేలకు మించి పంపకూడదు. ఒక వ్యక్తి నెల మొత్తంలో పంపే డబ్బు రూ.25 వేలకు మించకూడదు. డబ్బు పంపే వ్యక్తికి బ్యాంకు ఖాతా ఉన్నా, డబ్బు తీసుకునే వ్యక్తికి ఖాతా లేకపోవచ్చు. అలాంటి వారికి ఏటీఎంలు, బ్యాంకు ప్రతినిధులు లేదా ఇతర అనుమతించిన మార్గాల ద్వారా నగదు అందించవచ్చు. అయితే ఒక్కసారి గరిష్ఠంగా రూ.10 వేలు మాత్రమే పంపాలి. ఒక వ్యక్తికి నెలలో ఇలా అందించే మొత్తం రూ.25 వేలకు మించకూడదు. డబ్బు పంపే వ్యక్తి మొబైల్ నంబర్‌ను బ్యాంకు ధ్రువీకరించాలి. కేవైసీ నిబంధనల ప్రకారం గుర్తింపు పత్రాన్ని కూడా నమోదు చేయాలి. నగదు రూపంలో పంపిన డబ్బును గుర్తించేందుకు నెఫ్ట్, ఐఎంపీఎస్ లావాదేవీల వివరాల్లో ప్రత్యేక సంకేతం ఉండాలి. డబ్బు పంపిన వ్యక్తి వివరాలను కూడా బ్యాంకులు నమోదు చేయాలి. ఒక బ్యాంకు ఖాతాలోకి అకస్మాత్తుగా ఎక్కువ మొత్తంలో డబ్బు జమ అవుతున్నా, అనుమానాస్పద లావాదేవీలు జరుగుతున్నా బ్యాంకులు వెంటనే పరిశీలించాలి. అనుమానం బలపడితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి.

ఇళ్ల కొనుగోళ్లకు ఛాగ్యం

పది నెలల్లో హైదరాబాద్‌లో రూ.44,305 కోట్ల ఇళ్ల రిజిస్ట్రేషన్లు



హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఇళ్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య స్వల్పంగా తగ్గినా, లావాదేవీల విలువ మాత్రం పెరిగింది. 2026 జనవరి నుంచి అక్టోబర్ వరకు నగర పరిధిలో 61,033 నివాస ప్రాపర్టీలు రిజిస్టర్ కాగా, వాటి మొత్తం విలువ రూ.44,305 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే రిజిస్ట్రేషన్ల సంఖ్య ఒక శాతం తగ్గగా, లావాదేవీల విలువ మూడు శాతం పెరిగింది. నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక ప్రకారం.. 2025 జనవరి--అక్టోబర్ మధ్య 61,699 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరిగి, వాటి విలువ రూ.43,048 కోట్లుగా నమోదైంది. 2024లో ఇదే కాలానికి 65,280 ఇళ్ల రిజిస్ట్రేషన్లు, రూ.40,078 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. అక్టోబర్‌లో 5,318 ఇళ్లు రిజిస్టర్ కాగా, వాటి విలువ రూ.4,395 కోట్లుగా ఉంది. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే రిజిస్ట్రేషన్లు 14 శాతం తగ్గాయి. సెప్టెంబర్‌తో పోలిస్తే ఐదు శాతం తగ్గుదల నమోదైంది. పితృపక్షాల సమయంలో సాధారణంగా కొనుగోలుదారులు ఆస్తుల కొనుగోళ్లను వాయిదా వేయడం కూడా అక్టోబర్‌లో మందగమనానికి కారణమని నివేదిక పేర్కొంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని ప్రాథమిక, ద్వితీయ మార్కెట్ లావాదేవీలను నివేదిక పరిగణనలోకి తీసుకుంది. జనవరి నుంచి అక్టోబర్ వరకు జరిగిన రిజిస్ట్రేషన్లలో రూ.50 లక్షల లోపు ఇళ్ల వాటా 55 శాతంగా ఉంది. రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల మధ్య ధర ఉన్న ఇళ్ల వాటా 25 శాతం కాగా, కోటికి పైబడిన ఇళ్ల వాటా 20 శాతంగా నమోదైంది. అయితే మొత్తం లావాదేవీల విలువలో కోటికి పైబడిన ఇళ్ల వాటా 51 శాతంగా ఉంది. ఈ విభాగంలో 12,322 ఇళ్లు రిజిస్టర్ కాగా, వాటి విలువ రూ.22,680 కోట్లకు చేరింది. రూ.50 లక్షల లోపు ఇళ్ల రిజిస్ట్రేషన్లు 33,420గా, వాటి విలువ రూ.10,751 కోట్లుగా నమోదైంది. రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల మధ్య ధర ఉన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు 15,289 కాగా, వాటి విలువ రూ.10,768 కోట్లు.

విశాలమైన ఇళ్లకు మొగ్గు

అక్టోబర్‌లో నమోదైన ఇళ్లలో 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న వాటి వాటా 65 శాతంగా ఉంది. 2,000 నుంచి 3,000 చదరపు అడుగుల ఇళ్ల వాటా 14 శాతానికి, 3,000 చదరపు అడుగులకు పైబడిన ఇళ్ల వాటా ఐదు శాతానికి పెరిగింది. మొత్తంగా 2,000 చదరపు అడుగులకు పైబడిన ఇళ్ల వాటా 19 శాతానికి చేరింది. జిల్లాల వారీగా చూస్తే అక్టోబర్ రిజిస్ట్రేషన్లలో రంగారెడ్డి జిల్లా వాటా 52 శాతంగా ఉంది. మేడ్చల్-మల్కాజిగిరి వాటా 29 శాతం, హైదరాబాద్ జిల్లా వాటా 18 శాతం, సంగారెడ్డి వాటా ఒక శాతంగా నమోదైంది. నగరంలో చదరపు అడుగు సగటు ధర 10 శాతం పెరిగి రూ.5,184కు చేరింది. రంగారెడ్డిలో రూ.5,879, మేడ్చల్-మల్కాజిగిరిలో రూ.3,807, సంగారెడ్డిలో రూ.3,005గా ఉంది. కోకాపేట్‌లో ఒక ఇల్లు రూ.13.12 కోట్లకు, జూబ్లీహిల్స్‌లో మరో ఇల్లు రూ.13.06 కోట్లకు రిజిస్టర్ అయ్యాయి. కోకాపేట్, పుప్పాలగూడ ప్రాంతాల్లోనూ రూ.6.93 కోట్ల నుంచి రూ.10.57 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. ఈ ఏడాది మేలో అత్యధికంగా 8,344 ఇళ్ల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

జనసైనికులకు వైసీపీ వార్నింగ్

జగన్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు

అమరావతి, నవంబర్ 12 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆ పార్టీ లీగల్ సెల్ హెచ్చరించింది. పరిమితులు దాటి వ్యక్తిగత దూషణలకు దిగితే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. పవన్ కల్యాణ్ మూడో భార్యకు విడాకుల అంశం నేపథ్యంలో జనసేన కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో హద్దులు దాటి వ్యవహరిస్తున్నారని వైసీపీ లీగల్ సెల్ ఆరోపించింది. జగన్, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన భాషతో వ్యాఖ్యలు చేయడమే కాకుండా, వాటిని రికార్డు చేసి వివిధ వేదికల్లో ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపింది. ఎక్స్ వేదికగా నిర్వహించిన స్పేస్‌లో జగన్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని గోవాడ రాఘవేంద్ర నాయుడుగా గుర్తించినట్లు వెల్లడించింది. పలు ఖాతాల ద్వారా అతను కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తించామని, త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో వ్యక్తిగత దూషణలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించింది.

తెలంగాణలో జనసేన కమిటీల రద్దు

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా జనసేన సంస్థాగత పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా జూన్ 2, 2026కు ముందు నియమించిన అన్ని పార్లమెంట్, జిల్లా, అసెంబ్లీ, జీహెచ్ఎంసీ ఇన్‌ఛార్జి పదవులను రద్దు చేస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. పీవోసీ, విద్యార్థి, యువజన, వీరమహిళా విభాగాలు, ఎమ్మెల్సీ సమన్వయకర్తలు, తాత్కాలిక కమిటీలను కూడా రద్దు చేసినట్లు తెలిపింది. అయితే రాష్ట్ర ముఖ్య నాయకులు, జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన చేరికల కమిటీ, అధికార ప్రతినిధులు యథావిధిగా కొనసాగుతారని స్పష్టం చేసింది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సూచనల మేరకు అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ కొత్త కమిటీలను దశలవారీగా నియమించనున్నట్లు వెల్లడించింది. స్థానిక సంస్థలతో పాటు 2029 సాధారణ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పోటీ చేయడానికి ఈ మార్పులు చేపడుతున్నట్లు పేర్కొంది. పాత పదవుల రద్దు అనేది సేవలకు ముగింపు కాదని, కొత్త బాధ్యతాయుత వ్యవస్థకు మార్గం సుగమం చేసే నిర్ణయమని తెలిపింది.

టీడీపీ నేత శత్రుచర్ల కన్నుమూత

విశాఖపట్నం, నవంబర్ 12 (ఈవార్తలు): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు (78) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో ఉత్తరాంధ్ర రాజకీయ వర్గాల్లో విషాదం నెలకొంది. 1948 ఆగస్టు 4న జన్మించిన విజయరామరాజు పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం చినమేరంగి సంస్థానానికి చెందినవారు. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో కొనసాగారు. నియోజకవర్గ సమస్యలపై గళమెత్తే నాయకుడిగా గుర్తింపు పొందారు. ఉత్తరాంధ్ర టైగర్, మన్యం పులి అనే పేర్లతో ఆయనను పిలిచేవారు. 1978లో జనతా పార్టీ తరఫున నాగూరు నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్, టీడీపీల్లో కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు. 2017లో టీడీపీ తరఫున శ్రీకాకుళం స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికై 2023 వరకు కొనసాగారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. అంత్యక్రియల వివరాలను కుటుంబ సభ్యులు త్వరలో వెల్లడించనున్నారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే కఠిన చర్యలు: పొన్నం

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): ఆర్టీసీ ఉద్యోగులపై భౌతిక దాడులకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఉద్యోగులు ఎక్కడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, అంతేగానీ దాడులకు పాల్పడవద్దని ప్రజలకు సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత అయితే, ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసి ఆత్మహత్య చేసుకున్న శంకర్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆయన కుమారుడు హేమంత్‌గౌడ్‌కు ఉద్యోగం కల్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ ఇప్పటికే పరిహారం అందించాయని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు ఒక రోజు వేతనం ద్వారా సుమారు రూ.కోటి సాయం చేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారని గుర్తుచేశారు.

బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం

15 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం



విశాఖపట్నం, నవంబర్ 12 (ఈవార్తలు): బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దక్షిణ అండమాన్ సముద్రం, పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నవంబర్ 13 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ అల్పపీడనం వాయవ్య దిశగా కదులుతూ 14 నాటికి తీవ్ర అల్పపీడనంగా, 15 నాటికి వాయుగుండంగా బలపడవచ్చని అంచనా వేసింది. సముద్ర పరిస్థితులు అనుకూలిస్తే మరింత బలపడే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. అయితే ఇది తుపానుగా మారుతుందా లేదా అన్నది ఇంకా స్పష్టత రాలేదు. ఈ వాతావరణ వ్యవస్థ కదలికలపై వాతావరణ నమూనాలు భిన్నమైన అంచనాలను సూచిస్తున్నాయి. ఇది వైపు వెళుతుందా? అనే దానిపై మరో రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మన్నార్ సింధుశాఖ పరిసరాల్లోని ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తమిళనాడు దక్షిణ ప్రాంతాలు, డెల్టా జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. నవంబర్ 15 తర్వాత ఉత్తర తమిళనాడులోనూ వర్షాలు పెరిగే సూచనలు ఉన్నాయి. నవంబర్ 14, 15 తేదీల్లో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా మారే సూచనలు ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు వెంటనే తీరానికి చేరుకోవాలని సూచించింది.

పాత కేసు విచారణకు కోర్టుకు సీఎం రేవంత్



హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. 2021లో నాగార్జునసాగర్ ఉపఎన్నిక ప్రచార సమయంలో కొవిడ్ నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై నమోదైన కేసు విచారణలో భాగంగా ఆయన వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి 2021 ఏప్రిల్ 11న నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తిలో ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు. ఆ సమయంలో మాస్క్ ధరించలేదని, ఇతర కొవిడ్ నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 313 కింద ఆయన వాంగ్మూలాన్ని న్యాయస్థానం రికార్డు చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల నియమావళి, కొవిడ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలతో రేవంత్ రెడ్డిపై పలు కేసులు నమోదయ్యాయి. 2026 ఫిబ్రవరి 28న కూడా ఇలాంటి ఏడు కేసుల విచారణకు ఆయన కోర్టుకు హాజరయ్యారు. వాటిలో 2019 హుజూర్‌నగర్ ఉపఎన్నిక, 2021లో కొవిడ్ సమయంలో నిర్వహించిన సభలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారంలో అనుమతి లేకుండా ర్యాలీ, సభ నిర్వహించారన్న ఆరోపణలపై రేవంత్ రెడ్డి, అప్పటి ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. అయితే వాటిలో ఒక క్రిమినల్ కేసును తెలంగాణ హైకోర్టు గతంలో కొట్టివేసింది. ఛార్జిషీట్‌లో ఉద్దేశపూర్వకంగా నిబంధనలు ఉల్లంఘించినట్లు నిరూపించే బలమైన ఆధారాలు లేవని పేర్కొంది.

పీవీ అంత్యక్రియలు ఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదు?

సోనియా ఆత్మకథపై సురభి వాణీదేవి విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' విడుదల నేపథ్యంలో మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు కుటుంబ సభ్యులు తీవ్రంగా స్పందించారు. పీవీపై సోనియాకు గౌరవం ఉంటే ఆయన అంత్యక్రియలను ఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదని పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ప్రశ్నించారు. సోనియా ఆత్మకథను తాను ఇంకా చదవలేదని, అయితే పీవీతో తనకు విభేదాలు లేవని, ఆయనంటే గౌరవమని సోనియా చెప్పినట్లు మీడియా ద్వారా తెలుసుకున్నానని వాణీదేవి తెలిపారు. పీవీ కాంగ్రెస్ పార్టీకి, గాంధీ కుటుంబానికి సేవ చేశారని, దేశ ప్రధానిగా పనిచేశారని గుర్తుచేశారు. అలాంటి నాయకుడి అంత్యక్రియలను ఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. స్వతంత్ర భారత చరిత్రలో మరే ప్రధానికీ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదని వ్యాఖ్యానించారు. మరోవైపు పీవీ మనవడు, బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ కూడా సోనియా పుస్తకంపై విమర్శలు చేశారు. ఆత్మకథలో అసత్యాలు ఉన్నాయని, చారిత్రక తప్పిదాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు.

మహిళా కమిషన్ ఎదుట ప్రీతిరెడ్డి హాజరు

కాలేజీల్లో ఏడాదికి 3 కార్యక్రమాలే నిర్వహించామని వివరణ

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): మల్లారెడ్డి విద్యాసంస్థల వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి గురువారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కలిశారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై కమిషన్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. భేటీ అనంతరం ప్రీతిరెడ్డి మాట్లాడుతూ.. కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు వివరంగా సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. కాలేజీల్లో సినీ కార్యక్రమాల నిర్వహణపై వస్తున్న వార్తలకు స్పందిస్తూ, తమకు చెందిన మూడు క్యాంపస్‌లలో ఏడాదిలో మూడు కార్యక్రమాలు మాత్రమే నిర్వహించామని చెప్పారు. వాటి వల్ల విద్యార్థుల రోజువారీ తరగతులకు ఎలాంటి ఆటంకం కలగలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి జారీ చేసిన మార్గదర్శకాలు, ఆదేశాలను తమ విద్యాసంస్థలు తప్పనిసరిగా పాటిస్తాయని తెలిపారు.

23 పట్టణ స్థానిక సంస్థలకు ఏపీలో ఎన్నికలు

షెడ్యూల్ విడుదల.. 26న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు

అమరావతి, నవంబర్ 12 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న నాలుగు నగరపాలక సంస్థలు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఈ వివరాలను ప్రకటించారు. దీంతో సంబంధిత పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 14 నుంచి 16 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 17న వాటిని పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 19 వరకు గడువు ఉంటుంది. నవంబర్ 26న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. న్యాయపరమైన వివాదాలు, వార్డుల పునర్విభజన కారణంగా గతంలో ఈ 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిలిచిపోయాయి. ఇటీవల న్యాయపరమైన అడ్డంకులు తొలగడంతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది.

మైనర్‌పై రేప్.. 20 ఏళ్ల జైలు

మెదక్ పోక్సో కోర్టు కీలక తీర్పు

మెదక్, నవంబర్ 12 (ఈవార్తలు): మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ యువకుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మెదక్ జిల్లా పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. రూ.20 వేల జరిమానా కూడా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన యువకుడికి మెదక్ జిల్లాకు చెందిన బాలికతో పరిచయం ఏర్పడింది. చదువు మానేసి ఇంట్లో ఉంటున్న ఆ బాలిక 2021 మే 11న ఇంటి నుంచి వెళ్లి కామారెడ్డిలోని స్నేహితురాలి ఇంట్లో ఉంది. ఈ విషయం తెలుసుకున్న నిందితుడు ఆమెకు ఫోన్ చేసి బస్టాండ్‌లో కలిశాడు. అక్కడి నుంచి తన ఇంటికి తీసుకెళ్లి రెండు రోజుల పాటు తన వద్ద ఉంచుకున్నాడు. బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు?

కొడిమ్యాల 318 సర్వే నంబర్‌పై ఫిర్యాదులు

ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవని బాధితుల ఆవేదన

కొడిమ్యాల, నవంబర్ 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని 318 సర్వే నంబర్‌లో అనుమతులు లేకుండా ఇటుక బట్టీ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు పొందకుండానే బట్టీ నడుపుతున్నారని ఫిర్యాదుదారులు చెబుతున్నారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శితో పాటు ఎంపీడీఓ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 318 సర్వే నంబర్‌లో ఇటుక బట్టీ నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? సంబంధిత శాఖల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) తీసుకున్నారా? పర్యావరణ నిబంధనలు పాటిస్తున్నారా? అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఒకే సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఫిర్యాదుదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలని కోరుతున్నారు. ఇటుక బట్టీకి అనుమతులు ఉన్నాయో లేదో పరిశీలించి, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్రీకాళహస్తి అన్నప్రసాద పోటులో అగ్నిప్రమాదం

నెయ్యి ఒలికిపడటంతో మంటలు.. సిబ్బంది, భక్తులు పరుగులు

శ్రీకాళహస్తి, నవంబర్ 12 (ఈవార్తలు): శ్రీకాళహస్తీశ్వర ఆలయంలోని అన్నప్రసాదాల తయారీ కేంద్రం (పోటు)లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆలయ దక్షిణ గోపురం సమీపంలోని పోటులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నెయ్యి ఒలికిపడటంతోనే మంటలు వ్యాపించినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. స్వామివారికి లడ్డూ, వడ, అన్నప్రసాదాలు తయారు చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. మంటలు, పొగ ఒక్కసారిగా వ్యాపించడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది, సమీపంలోని భక్తులు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఆలయ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా సమీప మండపాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఆలయ ఈవో, ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదం కారణంగా ప్రసాదాల తయారీని తాత్కాలికంగా నిలిపివేశారు. అగ్నిప్రమాదానికి గల పూర్తి కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

2,043 రోజులుగా పేదలకు అన్నదానం

వేములవాడ అర్బన్, నవంబర్ 12 (ఈవార్తలు): మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 2,043 రోజులుగా అన్నదాన కార్యక్రమం కొనసాగుతోందని ట్రస్ట్ నిర్వాహకుడు మధు మహేష్ తెలిపారు. గురువారం టీటీడీ ధర్మశాల, రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద పేదలకు, ఆకలితో ఉన్నవారికి భోజనం అందించారు. దాతలు అందించే ప్రతి రూపాయి ఆకలితో ఉన్నవారి కడుపు నింపేందుకు ఉపయోగపడుతోందని మధు మహేష్ చెప్పారు. సమాజంలో ఎంతోమంది ఆకలితో ఇబ్బందులు పడుతున్నారని, మనకు ఉన్నదానిలో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి పంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, పితృదేవతల స్మరణ వంటి సందర్భాల్లో అన్నదానం చేయడం మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. గోపన్నగారి శ్రీవల్లి పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు శ్రీనివాస్ శర్మ, స్వప్న దంపతులు; దొంతుల భాగ్యలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా ఆమె మనుమడు అద్విత్ కృష్ణ, కుమారుడు, కోడలు లావణ్ కుమార్, కాత్యాయని దంపతులు అన్నదానానికి సహకరించారు. అన్నదాన శాశ్వత దాతలుగా జువ్వాడి వెంకటేశ్వరరావు, స్నేహలత, ప్రతాప, స్వప్న, సంపత్, నగుబోతు రవీందర్, జ్యోతి, గణాచారి సాంబశివ, శైలజ, దేవరాజు, ఉమ, బాలచందర్ రాజు, రామడుగు శ్రీలత, వారి కుటుంబ సభ్యులు, ప్రజ్ఞ, శరత్ చంద్ర, శిరీష, సాయిచంద్ర, శర్వాణి, రవిచంద్ర దంపతులు (హైదరాబాద్), చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ సహకరించినట్లు ట్రస్ట్ తెలిపింది. కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలు, ట్రస్ట్ సభ్యులకు మధు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. సేవాభావం ఉన్నవారు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ఆకలి లేని సమాజ నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, గొంగళ్ల రవికుమార్, పొలాస రాజేందర్, పసుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





54 మందికి రూ.12.42 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

కోరుట్ల, నవంబర్ 12 (ఈవార్తలు): కోరుట్ల నియోజకవర్గానికి చెందిన 54 మంది లబ్ధిదారులకు రూ.12,42,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు చేయించుకోలేని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న సాయం ఎంతో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

నాలుగేళ్లుగా టెండర్ల దశలోనే ఎన్‌హెచ్-563 పనులు

జగిత్యాల-కరీంనగర్ నాలుగు వరుసల రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలి

హెచ్ఏఎం విధానంలో టెండర్లు పిలవాలి: కేంద్ర మంత్రికి జయశ్రీ వినతి



జగిత్యాల, నవంబర్ 12 (ఈవార్తలు): జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-563) నాలుగు వరుసల విస్తరణ పనుల్లో జాప్యాన్ని నివారించి, నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం పంపించారు. 2022 నుంచి పలుమార్లు టెండర్లు పిలవడం, రద్దు చేయడం, గడువు పొడిగించడం, టెండర్ విధానాలు మార్చడం జరుగుతున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదని జయశ్రీ పేర్కొన్నారు. బీఓటీ (టోల్) విధానానికి బదులుగా హెచ్ఏఎం విధానంలో టెండర్లు పిలవాలని కోరారు. ప్రస్తుతం రహదారి ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణలో భూములు కోల్పోయిన వారిలో సుమారు 50 శాతం మందికే పరిహారం అందిందని, మిగిలిన వారికి కూడా వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. టెండర్ల జాప్యానికి కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించాలని, ప్రస్తుత టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించాలని కేంద్ర మంత్రిని కోరారు.



57 మందికి రూ.57 లక్షల కల్యాణలక్ష్మి చెక్కులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందేలా చర్యలు

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, నవంబర్ 12 (ఈవార్తలు): ఆడబిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణానికి చెందిన 57 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన రూ.57 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, లబ్ధిదారులు దళారులను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఏఎంసీ ఛైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, తహసీల్దార్ రామ్మోహన్, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, ఆడువాల లక్ష్మణ్, దుమాల రాజ్‌కుమార్, బీరం రాజేష్, రవీందర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రకు వేములవాడ బీజేపీ సన్నాహాలు

వేములవాడ అర్బన్, నవంబర్ 12 (ఈవార్తలు): కరీంనగర్‌లో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేసేందుకు వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. పాదయాత్రను విజయవంతం చేసేందుకు వేములవాడ పట్టణం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు, జిల్లా పదాధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ పదాధికారులు, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కొత్తగా 8,209 మందికి పింఛన్లు

మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్, నవంబర్ 12 (ఈవార్తలు): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జిల్లాలో కొత్తగా 8,209 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 19 నుంచి కొత్త లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛను నగదు జమ కానుందని తెలిపారు. వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జయ జయహే తెలంగాణ గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించి, లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19 నుంచి కొత్తగా మంజూరైన పింఛన్ల నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 1,13,264 మందికి పింఛన్లు అందుతున్నాయని, కొత్తగా మంజూరైన వాటితో కలిపి మొత్తం 1,21,473 మందికి ప్రతి నెలా పింఛన్లు అందనున్నాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు, వైస్ ఛైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు రొండి రాజు, చెలుకల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, పీఏసీఎస్ ఛైర్మన్లు వకులాభరణం శ్రీనివాస్, బొమ్మెన భాస్కర్, ఏగోలపు శ్రీనివాస్, గసికంటి ప్రభాకర్, పిల్లి కనకయ్య, ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయి, పాప పుట్టాక కల్యాణలక్ష్మి చెక్కు!

జగిత్యాలలో ఆలస్యంగా అందిన పథకం సాయం

పసిపాపతో చెక్కు తీసుకునేందుకు వచ్చిన కుటుంబ సభ్యులు

రూ.లక్ష నగదుతో పాటు 10 గ్రాముల బంగారం హామీ ఏమైందంటూ ప్రశ్నలు



జగిత్యాల, నవంబర్ 12 (ఈవార్తలు): ఆడబిడ్డ పెళ్లి సమయంలో పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలన్నది కల్యాణలక్ష్మి పథకం ఉద్దేశం. అయితే జగిత్యాలలో ఓ లబ్ధిదారురాలికి పెళ్లయి, పాప పుట్టిన తర్వాత ఈ పథకం చెక్కు అందడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జగిత్యాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఓ లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులు పసిపాపతో వచ్చారు. చిన్నారిని ఆమె అమ్మమ్మ ఎత్తుకుని ఉండటంతో పెళ్లి సమయంలో అందాల్సిన ఆర్థిక సాయం బిడ్డ పుట్టిన తర్వాత అందిందనే విషయం స్థానికంగా చర్చకు దారితీసింది. 2023 అక్టోబరు 16న అప్పటి తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కీలక హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద రూ.లక్ష నగదుతో పాటు 10 గ్రాముల బంగారం అందిస్తామని ప్రకటించారు. అయితే ఈ హామీ అమలుపై కూడా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పెళ్లి ఖర్చుల సమయంలో పేద కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనివ్వడమే కల్యాణలక్ష్మి పథకం ప్రధాన ఉద్దేశం. పెళ్లయి, పిల్లలు పుట్టిన తర్వాత సాయం అందితే పథకం లక్ష్యం నెరవేరుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దరఖాస్తుల పరిశీలన, మంజూరు, చెక్కుల పంపిణీలో జాప్యానికి కారణాలేంటి? లబ్ధిదారులకు సకాలంలో సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఏడాదిగా అందని ఎక్స్‌గ్రేషియా

200 బాధిత కుటుంబాలకు రూ.10 కోట్లు చెల్లించాలి

బకాయిలను వెంటనే విడుదల చేయాలి: జీవన్‌రెడ్డి

రాయికల్, నవంబర్ 12 (ఈవార్తలు): గల్ఫ్ దేశంలో ఉపాధి కోసం వెళ్లి మరణించిన పాలేపు రాజాం మృతదేహం గురువారం ఉదయం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ రవీందర్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల అకాల మరణాలతో వారి కుటుంబాలు దిక్కుతోచని పరిస్థితుల్లో పడుతున్నాయని అన్నారు. గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించే పథకం ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. సుమారు 200 బాధిత కుటుంబాలకు దాదాపు రూ.10 కోట్ల సాయం అందాల్సి ఉందన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో ఇటీవల సుమారు పది మంది గల్ఫ్‌లో మరణించారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుల పిల్లలకు విద్యా సాయం, భార్యలకు వితంతు పింఛన్లు, ఇళ్లు లేని కుటుంబాలకు గృహాలు మంజూరు చేయాలని కోరారు. గల్ఫ్ బాధిత కుటుంబాలకు సంక్షేమ పథకాలు ప్రాధాన్యతతో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం

సుల్తానాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని ఏఈఓ రవితేజ సూచించారు. సుల్తానాబాద్ మండలం చిన్న బోంకూర్ గ్రామంలో నిర్వహించిన క్షేత్ర బచావో అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. కేవీకే శాస్త్రవేత్త వినోద్ మాట్లాడుతూ పంట అవశేషాలు, వరి దుబ్బాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని చెప్పారు. ఇలా చేయడం వల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరిగి భూసారం మెరుగుపడుతుందని వివరించారు. నేలను కాపాడుకోవడంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రవితేజ, కేవీకే శాస్త్రవేత్త వినోద్, కృషి సఖీలు మంజుల, స్వప్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.



నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు

జగిత్యాల, నవంబర్ 12 (ఈవార్తలు): ప్రైవేట్ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2010 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ హెచ్చరించారు. గురువారం తన ఛాంబర్‌లో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం నిర్వహించి, తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ నిబంధనలు-2022 అమలుపై సమీక్షించారు. రిజిస్ట్రేషన్ సమయంలో నమోదు చేసిన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది మాత్రమే ఆసుపత్రుల్లో సేవలందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సిబ్బందిలో మార్పులు జరిగితే రిజిస్ట్రేషన్‌లో వెంటనే వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. వైద్య సేవలకు వసూలు చేసే ఫీజుల వివరాలను ప్రజలకు కనిపించేలా బోర్డులపై ప్రదర్శించాలని, నిరుపేదలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలని చెప్పారు. బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి. సుజాత చట్టం అమలు తీరు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరించారు. సమావేశంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జి. శశికాంత్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్, ఇన్‌చార్జి డెమో ఏనుగంటి రాజేశం, హెల్త్ ఎడ్యుకేటర్ రవీందర్ రాథోడ్, జూనియర్ అసిస్టెంట్ వి. సాగర్ తదితరులు పాల్గొన్నారు.



కొండగట్టు చందనోత్సవానికి ప్రముఖులకు ఆహ్వానం

మంత్రి అడ్లూరి, విప్ ఆది శ్రీనివాస్‌కు ఆహ్వాన పత్రికల అందజేత

జగిత్యాల, నవంబర్ 12 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న చందనోత్సవం, మహాసంప్రోక్షణ కార్యక్రమాలకు హాజరుకావాలని పలువురు ప్రముఖులను ఆలయ అధికారులు ఆహ్వానించారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి హరిహరనాథ్, ప్రధాన అర్చకులు మారుతీ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. అదేవిధంగా జగిత్యాల జిల్లా కలెక్టర్‌ను కూడా ఆర్డీఓ, అదనపు కలెక్టర్ కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ప్రముఖులు చందనోత్సవ వేడుకలకు హాజరుకావాలని దేవస్థానం అధికారులు కోరారు.



కోటిలింగాల పుష్కర పనులు వేగంగా పూర్తి చేయాలి

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి

పనులను పరిశీలించిన జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, నవంబర్ 12 (ఈవార్తలు): కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణంతో పాటు గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సంబంధిత శాఖల అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వ కారణంగా స్నానఘట్టాల నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నీటిని తొలగించే విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఆయన తెలిపారు. ఆలయ పరిసరాల్లోకి నీరు చేరకుండా రిటైనింగ్ వాల్ నిర్మించాలని, అవసరమైతే స్నానఘట్టాల రూపకల్పనలో మార్పులు చేయాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, రవాణా సదుపాయాల పనులతో పాటు అర్చకుల కుటీర నిర్మాణాన్ని కూడా త్వరగా చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ శేఖర్, ఎంపీఓ కృపాకర్, దేవాదాయ శాఖ ఏఈ సంతోష్ రెడ్డి, ఈవో కాంతారెడ్డి, సర్పంచ్ కోటయ్య, ఆలయ ఛైర్మన్ పూదరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేజ్రీవాల్, కుమార్తెకు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

న్యూఢిల్లీ, నవంబర్ 12: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఆయన కుమార్తె హర్షితకు ప్రాణహాని బెదిరింపులు వచ్చినట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. లారెన్స్ బిష్ణోయ్ ముఠా పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు రూ.7 కోట్లు ఇవ్వాలని, లేదంటే కేజ్రీవాల్‌తో పాటు ఆయన కుమార్తెను హతమారుస్తామని హెచ్చరించినట్లు తెలిపాయి. ఢిల్లీలోని తిలక్ నగర్ ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. తన ఫోన్‌కు గుర్తుతెలియని వ్యక్తి నుంచి కాల్, వాట్సాప్ సందేశాలు వచ్చాయని చెప్పారు. లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడినంటూ పరిచయం చేసుకున్న వ్యక్తి డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జర్నైల్ సింగ్ నవంబర్ 6న పంజాబ్‌లోని మోహాలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మోహాలీ సైబర్ క్రైమ్ విభాగం దర్యాప్తు చేపట్టింది. బెదిరింపులకు ఉపయోగించిన ఫోన్ నంబర్, కాల్ వివరాలు, ఇంటర్నెట్ చిరునామాలు, ఇతర సమాచారాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. నిజంగానే ఈ బెదిరింపుల వెనుక బిష్ణోయ్ ముఠా ఉందా? లేక ఆ ముఠా పేరును వాడుకున్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కేజ్రీవాల్, ఆయన కుటుంబానికి భద్రత కల్పించాలని ఆప్ నేతలు పోలీసులను కోరారు.

బ్యాంకులకు 1.16 లక్షల కోట్ల లాభం

నికర లాభాల్లో 20 శాతం వృద్ధి

రుణాల మంజూరు పెరగడమే ప్రధాన కారణం



ముంబై, నవంబర్ 12: దేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల లాభాలు భారీగా పెరిగాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (జులై-సెప్టెంబర్) బ్యాంకుల నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 20 శాతం పెరిగి రూ.1.16 లక్షల కోట్లకు చేరింది. రుణాల మంజూరు పెరగడం, వడ్డీ ఆదాయం మెరుగుపడటం ఇందుకు ప్రధాన కారణాలని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక తెలిపింది. బ్యాంకులు ఇచ్చిన రుణాలు దాదాపు 19 శాతం పెరిగాయి. దీంతో వడ్డీ రూపంలో వచ్చే ఆదాయం మెరుగుపడింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభాల వృద్ధి 4.2 శాతానికే పరిమితమైంది. అయితే బాండ్లపై వడ్డీ రేట్లు పెరగడంతో వాటి ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని నివేదిక పేర్కొంది. బ్యాంకుల ఆస్తులపై రాబడి (ఆర్ఓఏ) 0.07 శాతం పాయింట్లు పెరిగి 1.39 శాతానికి చేరింది. ఈక్విటీపై రాబడి (ఆర్ఓఈ) 0.79 శాతం పాయింట్లు పెరిగి 13.6 శాతంగా నమోదైంది. బ్యాంకుల ఆర్థిక భద్రతను సూచించే కామన్ ఈక్విటీ టైర్-1 నిష్పత్తి కూడా 15.8 శాతానికి పెరిగింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో బ్యాంకుల లాభాల వృద్ధి కొంత తగ్గవచ్చని కేర్‌ఎడ్జ్ అంచనా వేసింది. ప్రత్యేక ఆదాయాలు తగ్గడం, బాండ్ల ద్వారా ఆదాయం బలహీనంగా ఉండటం, రుణాల నష్టాల కోసం అదనపు నిధులు కేటాయించాల్సి రావడం ఇందుకు కారణాలుగా పేర్కొంది.



టాటా పదవులకు నోయెల్ బై

70 ఏళ్ల వయోపరిమితితో పలు కంపెనీలకు రాజీనామా

టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా కొనసాగింపు

ముంబై, నవంబర్ 12: టాటా గ్రూప్‌లో కీలక నాయకత్వ మార్పులు చోటుచేసుకున్నాయి. నోయెల్ టాటా గ్రూప్‌లోని పలు కంపెనీల పదవుల నుంచి వైదొలిగారు. టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ పదవులకు రాజీనామా చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా కంపెనీ బోర్డు 'చైర్మన్ ఎమెరిటస్'గా నియమించింది. టాటా గ్రూప్ నిబంధనల ప్రకారం నాన్-ఎగ్జిక్యూటివ్, నాన్-ఇండిపెండెంట్ డైరెక్టర్లకు 70 ఏళ్ల వయసు పదవీ విరమణ పరిమితిగా ఉంది. నోయెల్ టాటా ఈ వయసుకు చేరుకోవడంతో ఆయన పదవీకాలం ముగిసింది. టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ కొత్త చైర్మన్‌గా ప్రముఖ కార్పొరేట్ న్యాయవాది బ్రహ్మ్ వాకిల్ బాధ్యతలు చేపట్టనున్నారు. ట్రెంట్, వోల్టాస్, టాటా ఇంటర్నేషనల్ కంపెనీల చైర్మన్ పదవుల నుంచి కూడా నోయెల్ టాటా తప్పుకున్నారు. ట్రెంట్‌కు బ్రహ్మ్ వాకిల్, వోల్టాస్‌కు సునీల్ డిసౌజా, టాటా ఇంటర్నేషనల్‌కు టాటా స్టీల్ ఎండీ టీవీ నరేంద్రన్ కొత్తగా బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా, టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్ నామినీ డైరెక్టర్‌గా నోయెల్ టాటా కొనసాగనున్నారు. టాటా గ్రూప్‌లో నాయకత్వ మార్పులు, పాలనాపరమైన అంశాలపై చర్చలు జరుగుతున్న సమయంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

యూపీ ఎన్నికల్లో కొత్త కూటమి

ఒవైసీ, చంద్రశేఖర్ ఆజాద్ చేతులు కలిపారు

'సామాజిక్ పరివర్తన్ మోర్చా'గా పేరు.. సీఎం అభ్యర్థిగా చంద్రశేఖర్ ఆజాద్

లక్నో, నవంబర్ 12: ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కొత్త కూటమి తెరపైకి వచ్చింది. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం, ఆజాద్ సమాజ్ పార్టీ కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. లక్నోలో నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆజాద్ సమాజ్ పార్టీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ ఈ విషయాన్ని ప్రకటించారు. తమ కూటమికి 'సామాజిక్ పరివర్తన్ మోర్చా' అని పేరు పెట్టినట్లు నేతలు తెలిపారు. కూటమి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రశేఖర్ ఆజాద్ పేరును ఒవైసీ ప్రతిపాదించారు. రాష్ట్రంలోని మొత్తం 403 అసెంబ్లీ స్థానాల్లోనూ పోటీ చేస్తామని ప్రకటించారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని చెప్పారు. దళితులు, ముస్లింలు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పనిచేస్తామని నేతలు తెలిపారు. అధికారంలోకి వస్తే 12వ తరగతి వరకు ఉచిత విద్య, మెరుగైన వైద్యం, యువతకు ఉపాధి కల్పిస్తామని చంద్రశేఖర్ ఆజాద్ చెప్పారు. సీట్ల కేటాయింపులో విభేదాల కారణంగానే విపక్ష ఇండియా కూటమిలో చేరలేదని ఒవైసీ స్పష్టం చేశారు.



సుందర్ పిచాయ్ నం.1

హరూన్ జాబితాలో అగ్రస్థానం

టాప్-5లో భారత సంతతి టెక్ దిగ్గజాలే

ప్రపంచ కార్పొరేట్ రంగంలో భారత సంతతి ప్రముఖులు తమ సత్తా చాటుతున్నారు. హెచ్ఎస్‌బీసీ హరూన్ గ్లోబల్ ఇండియన్స్ జాబితా-2026లో గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ మొదటి స్థానంలో నిలిచారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల రెండో స్థానానికి పరిమితమయ్యారు. మైక్రాన్ టెక్నాలజీ సీఈవో సంజయ్ మెహ్రోత్రా మూడో స్థానంలో, యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్ నాలుగో స్థానంలో, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ ఐదో స్థానంలో నిలిచారు.

న్యూయార్క్, నవంబర్ 12: అంతర్జాతీయ టెక్నాలజీ సంస్థలకు నాయకత్వం వహిస్తున్న భారత సంతతి వ్యక్తులే తొలి ఐదు స్థానాలను దక్కించుకోవడం విశేషం. హరూన్ నివేదిక ప్రకారం.. భారత్ వెలుపల ప్రధాన కార్యాలయాలు కలిగిన 200 అంతర్జాతీయ సంస్థలకు 236 మంది భారత సంతతి వ్యక్తులు నాయకత్వం వహిస్తున్నారు. ఈ సంస్థల మొత్తం మార్కెట్ విలువ 15 ట్రిలియన్ డాలర్లకు (సుమారు రూ.1,305 లక్షల కోట్లు) చేరింది. 2024తో పోలిస్తే ఇది 53 శాతం పెరిగింది. ఈ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా సుమారు 53 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఆల్ఫాబెట్ మార్కెట్ విలువ 2024 నుంచి దాదాపు 98 శాతం పెరిగింది. మరోవైపు మైక్రోసాఫ్ట్ విలువ 17 శాతం తగ్గింది. ఏఐ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌తో మైక్రాన్ మార్కెట్ విలువ కూడా భారీగా పెరిగింది. 2024తో పోలిస్తే అది 1,174 శాతం వృద్ధి చెంది 1.4 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు నివేదిక తెలిపింది. జాబితాలో ఏఐ సంస్థల ప్రాబల్యం స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తం 103 సంస్థలు ఏఐ ఆధారిత సేవలు అందిస్తుండగా, వాటి విలువ 10.7 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. అత్యంత విలువైన పది అంకుర సంస్థల్లో ఏడు ఏఐ రంగానికి చెందినవే.



జీటీఏ-6 ఆడితే ఏడాదికి రూ.కోటి జీతం

న్యూఢిల్లీ, నవంబర్ 12: వీడియో గేమ్స్ ఆడటాన్ని ఉద్యోగంగా మార్చుకుని ఏడాదికి కోటి రూపాయలకు పైగా సంపాదించే అవకాశం వచ్చింది. అమెరికాకు చెందిన ప్రిడిక్షన్ మార్కెట్ సంస్థ 'కల్షీ' జీటీఏ-6 గేమ్‌పై పరిశోధన చేసేందుకు ప్రత్యేక ఉద్యోగాన్ని ప్రకటించింది. ఈ ఉద్యోగానికి ఏడాదికి లక్ష నుంచి 1.2 లక్షల డాలర్ల వరకు వేతనం ఇవ్వనుంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.88 లక్షల నుంచి రూ.1.06 కోట్ల వరకు ఉంటుంది. 'జీటీఏ-6 రీసెర్చర్' పేరుతో ప్రకటించిన ఈ ఉద్యోగంలో ఎంపికైన వ్యక్తి గేమ్ విడుదలైన రోజు నుంచే ఆడటం ప్రారంభించాలి. ప్రధాన కథ పూర్తయ్యే వరకు గేమ్ ఆడుతూ, ఆ ప్రక్రియను ట్విచ్ లేదా యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలి. గేమ్‌లోని కల్పిత లియోనిడా ప్రాంతంలోని ధరలు, ఉద్యోగాలు, వ్యాపారాలు, వినియోగదారుల ఖర్చులను పరిశీలించి నివేదిక రూపొందించాలి. గేమ్ విడుదల వల్ల నిజ జీవితంలో ఉద్యోగుల హాజరు, ఫుడ్ డెలివరీ సేవల వినియోగం వంటి అంశాలపై ఎలాంటి ప్రభావం పడుతుందో కూడా అధ్యయనం చేయాలి. వేతనంతోపాటు గేమింగ్, స్ట్రీమింగ్ ఖర్చుల కోసం 15 వేల డాలర్ల భత్యం ఇవ్వనున్నారు. 100 అంగుళాల టీవీ, ప్లేస్టేషన్-5 లేదా ఎక్స్‌బాక్స్ కన్సోల్, రోజువారీ ఫుడ్ డెలివరీ క్రెడిట్లు, జిమ్ సభ్యత్వం కూడా అందించనున్నారు. దరఖాస్తుదారులకు కనీసం 18 ఏళ్ల వయసు, పదేళ్ల గేమింగ్ అనుభవం ఉండాలి. ఆర్థిక వ్యవస్థలు, ఫైనాన్స్‌పై అవగాహన కూడా అవసరం. జీటీఏ-6 నవంబర్ 19న ప్లేస్టేషన్-5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ పరికరాలపై విడుదల కానుంది.

గూఢచర్యం ఆరోపణలతో టెక్నాలజీ ఆంక్షలా?

అమెరికాపై చైనా ఆగ్రహం

బీజింగ్, నవంబర్ 12: ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ వ్యవహారాన్ని అడ్డం పెట్టుకుని చైనాపై సాంకేతిక ఆంక్షలు విధించేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని చైనా ఆరోపించింది. గూఢచర్యం పేరుతో తమ దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు మానుకోవాలని బీజింగ్ హితవు పలికింది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. తమ దేశ సాంకేతిక ప్రగతి స్వతంత్ర ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారం వల్లే సాధ్యమైందన్నారు. చైనాపై ఆంక్షలను సమర్థించుకునేందుకు గూఢచర్యం ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం.. జెన్సన్ హువాంగ్‌కు సింగపూర్‌కు చెందిన డేటా సెంటర్ సంస్థ మాజీ ఎగ్జిక్యూటివ్ ఆలిస్ హువాంగ్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆమె చైనా నిఘా వర్గాల కోసం పనిచేశారని, ఎన్విడియా చిప్‌లను చైనాకు తరలించడంలో సహకరించారని అమెరికా అధికారులు అనుమానిస్తున్నట్లు కథనం పేర్కొంది. అయితే చిప్‌ల మళ్లింపుపై అంతర్గత విచారణ జరిపామని, ఆరోపణల్లో నిజం లేదని ఎన్విడియా తెలిపింది. వివాహేతర సంబంధం విషయంలో తాను తప్పు చేశానని జెన్సన్ హువాంగ్ అంగీకరించి భార్య, కుటుంబ సభ్యులకు క్షమాపణలు చెప్పారు. ఈ వ్యవహారంపై ఎన్విడియా డైరెక్టర్ల బోర్డు స్వతంత్ర విచారణ జరిపి, జాతీయ భద్రతకు ముప్పు లేదని నిర్ధారించింది. హువాంగ్ సీఈవోగా కొనసాగుతారని ప్రకటించింది. మరోవైపు ఎఫ్‌బీఐ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. చైనాకు అధునాతన ఏఐ చిప్‌ల విక్రయాలపై అమెరికా విధిస్తున్న ఆంక్షలను సడలించాలని హువాంగ్ గతంలో పలుమార్లు కోరారు. వచ్చే వారం షెన్‌జెన్‌లో జరగనున్న ఏపెక్ సదస్సు సందర్భంగా ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ కానున్న నేపథ్యంలో ఈ వివాదం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఎస్బీఐ లాకర్ తెరిస్తే ఖాళీ

రిటైర్డ్ ఐపీఎస్ అధికారికి షాక్

భోపాల్, నవంబర్ 12: బ్యాంకు లాకర్‌లో భద్రపరిచిన విలువైన వస్తువులు కనిపించకపోవడంతో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏపీ శ్రీవాస్తవ షాక్‌కు గురయ్యారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఎస్బీఐ శాఖలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లో ఉన్న ఎస్బీఐ శాఖలో శ్రీవాస్తవకు లాకర్ ఉంది. తన ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆయన ఈ లాకర్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం కుమార్తె సురభితో కలిసి బ్యాంకుకు వెళ్లి లాకర్ తెరవడానికి ప్రయత్నించగా తాళం మొరాయించింది. దీంతో బ్యాంకు సిబ్బంది సహాయం తీసుకున్నారు. సిబ్బంది లాకర్ తెరిచి చూడగా అందులో ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు కనిపించలేదు. చివరిసారిగా 2024లో లాకర్‌ను ఉపయోగించామని శ్రీవాస్తవ తెలిపారు. అందులో ఉంచిన వస్తువులన్నీ ఏమయ్యాయో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు మేనేజర్ హరీశ్ మెహ్రో లాకర్ ఖాళీగా ఉన్న విషయాన్ని ధ్రువీకరించారు. అయితే వస్తువులను వేరే లాకర్‌లో ఉంచి ఉండవచ్చన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. బాధితుడి నుంచి లిఖితపూర్వక ఫిర్యాదు అందాల్సి ఉందని అధికారులు తెలిపారు.

స్టాక్ మార్కెట్లకు లాభాల పంట



ముంబై, నవంబర్ 12: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. రియల్టీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి. ఆటో రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి లాభాలను పరిమితం చేసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 31.61 పాయింట్లు పెరిగి 81,911.01 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 44.30 పాయింట్ల లాభపడి 25,299.35 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు ప్రధాన సూచీల కంటే మెరుగ్గా రాణించాయి. మిడ్‌క్యాప్-100 సూచీ 0.85%, స్మాల్‌క్యాప్-100 సూచీ 1.12 % పెరిగాయి. రంగాల వారీగా రియల్టీ సూచీ 4 శాతం లాభంతో ముందంజలో నిలిచింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, మీడియా, బ్యాంకింగ్ సూచీ లు కూడా లాభపడ్డాయి. మరోవైపు ఆటో రంగ సూచీ నష్టపో యింది. నిఫ్టీ షేర్లలో మహీంద్రా అండ్ మహీంద్రా, నెస్లే ఇండియా, పవర్‌గ్రిడ్ నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ ప్రస్తుతం 25,000 నుంచి 25,500 పాయింట్ల మధ్య కదిలే అవకాశముందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దిగువన 25,000 వద్ద తక్షణ మద్దతు, 24,800 వద్ద కీలక మద్దతు ఉందని, పైవైపు 25,500 వద్ద నిరోధం ఎదురుకావచ్చని పేర్కొన్నారు.

పీవీకి సోనియా గౌరవం ఇవ్వలేదేమో!: పృథ్వీరాజ్ చవాన్

ముంబై, నవంబర్ 12: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు మరణించినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆయనకు తగిన గౌరవం ఇవ్వలేదన్న ఆరోపణల్లో కొంత నిజం ఉందని సీనియర్ కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్ అన్నారు. సోనియా గాంధీ ఆత్మకథ చుట్టూ సాగుతున్న చర్చ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నరసింహారావు కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ప్రధానిగా పనిచేసినప్పటికీ మరణించినప్పుడు పార్టీ తరఫున తగిన గౌరవం దక్కలేదన్న ఆరోపణలు ఉన్నాయని చవాన్ పేర్కొన్నారు. ఆయనకు కాంగ్రెస్ లాంఛనాలతో గౌరవం కల్పించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. బాబ్రీ మసీదు కూల్చివేత విషయంలో పీవీపై ఆరోపణలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఆయనకు గౌరవం ఇవ్వడం వల్ల



కొన్ని వర్గాలు నొచ్చుకోవచ్చని సోనియా భావించి ఉండొచ్చని చవాన్ అన్నారు. అయితే ఇది తన అంచనా మాత్రమేనని, వాస్తవంగా ఏం జరిగిందో తనకు తెలియదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సోనియా తన పుస్తకంలో ప్రస్తావించారో లేదో కూడా తనకు తెలియదన్నారు. మరోవైపు పీవీ మనవడు, తెలంగాణ బీజేపీ అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్ సోనియా పుస్తకంపై విమర్శలు చేశారు. చరిత్రకు సంబంధించిన తప్పులతో పుస్తకం నిండిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి, దేశానికి పీవీ చేసిన సేవలను కావాలనే విస్మరించారని విమర్శించారు. రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి రావడం తనకు ఇష్టం లేదని సోనియా చెప్పడాన్ని, మరోవైపు తన పిల్లలను రాజకీయాల్లోకి ప్రోత్సహించడాన్ని కూడా సుభాష్ తప్పుబట్టారు.

ఆడబిడ్డ పుట్టిన తెల్లారే రూ.1.5 కోట్ల లాటరీ!

పంజాబ్‌లో కార్పెంటర్‌కు అదృష్టం

కూతురికి 'బర్కత్' అని పేరు పెట్టిన కుటుంబం

మాన్సా, నవంబర్ 12: ఆడపిల్ల పుట్టిన ఇంట్లో మహాలక్ష్మి అడుగుపెట్టిందన్న నమ్మకాన్ని నిజం చేస్తూ పంజాబ్‌లో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. కుమార్తె పుట్టిన మరుసటి రోజే ఆమె తండ్రికి రూ.1.5 కోట్ల లాటరీ తగిలింది. దీంతో ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది. పంజాబ్‌లోని మాన్సా జిల్లా బరేటాకు చెందిన 24 ఏళ్ల యుధ్‌వీర్ సింగ్ వడ్రంగి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. నవంబర్ 4న భార్య హర్మన్ కౌర్‌ను ఆసుపత్రికి తీసుకెళ్తున్న



సమయంలో మార్గమధ్యంలో కనిపించిన పంజాబ్ స్టేట్ డియర్-200 మంత్లీ లాటరీ టికెట్‌ను రూ.200కు కొనుగోలు చేశాడు. భార్య వద్దని వారించినా ఆమె పేరు మీదే టికెట్ తీసుకున్నాడు. నవంబర్ 6న హర్మన్ కౌర్ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మరుసటి రోజే లాటరీ ఫలితాలు వెలువడగా యుధ్‌వీర్ కొనుగోలు చేసిన టికెట్‌కు మొదటి బహుమతిగా రూ.1.5 కోట్లు వచ్చాయి. దీంతో తమ ఇంటికి వచ్చిన చిన్నారే అదృష్టాన్ని తీసుకొచ్చిందని భావించిన తల్లిదండ్రులు ఆమెకు 'బర్కత్' అని పేరు పెట్టారు. లాటరీ సొమ్ముతో ముందుగా ఇంటి అప్పులు తీర్చుతానని, మిగిలిన మొత్తాన్ని కుమార్తె చదువు, భవిష్యత్తు కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని యుధ్‌వీర్ తెలిపాడు. ఈ ఘటన ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

దేశ విజయాలపై ప్రత్యేక కథనాలు రాయండి: మోదీ

న్యూఢిల్లీ, నవంబర్ 12: దేశం సాధిస్తున్న విజయాలు, అభివృద్ధికి సంబంధించిన కథనాలపై మీడియా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల కోసం నిర్వహించిన దీపావళి మిలన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మీడియాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మోదీ.. గతంలో ప్రెస్ నోట్ల నుంచి నేటి సామాజిక మాధ్యమాల వరకు వార్తా రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. గతంలో పేదరికం తొలగిస్తామంటూ నినాదాలు ఇచ్చేవారని, తమ ప్రభుత్వం మాత్రం ఆచరణలో పేదరికాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుందని చెప్పారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం గత 12 ఏళ్లలో సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, సంక్షోభ సమయాల్లోనూ క్షేత్రస్థాయికి వెళ్లి వార్తలు సేకరించే రిపోర్టర్ల కృషిని ప్రధాని ప్రశంసించారు. ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించే జర్నలిస్టుల సేవలు గొప్పవని కొనియాడారు. గతంలో తాను కూడా ఇలాంటి కార్యక్రమాల్లో కుర్చీలు సర్దే స్థాయి నుంచి మీడియాతో అనుబంధం కొనసాగించానని గుర్తుచేసుకున్నారు. యువతను నాశనం చేస్తున్న మత్తు పదార్థాల వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని మీడియా ప్రతినిధులను కోరారు.





గత జన్మలో నేను రాజును

నవంబర్ 12 (ఈవార్తలు): బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తన గత జన్మకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయాన్ని గతంలో వెల్లడించారు. ప్రముఖ దర్శక నిర్మాత కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన 'కాఫీ విత్ కరణ్' ఐదో సీజన్‌లో నటి సుస్మితా సేన్‌తో కలిసి పాల్గొన్న ఆయన.. పూర్వజన్మలో తాను రాజుగా ఉన్నట్లు ఓ పండితుడు చెప్పిన విషయాన్ని పంచుకున్నారు. తన స్నేహితుడి సూచనతో ఓ చిన్న గ్రామానికి వెళ్లినప్పుడు ఈ అనుభవం ఎదురైందని సంజయ్ దత్ తెలిపారు. అక్కడ వేలిముద్ర ఆధారంగా తాళపత్రాలను పరిశీలించి, తన గత జన్మ వివరాలను పండితుడు చెప్పినట్లు వెల్లడించారు. ఆ తాళపత్రాల ప్రకారం.. తాను అశోక సామ్రాజ్య కాలంలో రాజుగా ఉండేవాడినని, తన భార్య మంత్రిని ప్రేమించిందని పండితుడు చెప్పినట్లు సంజయ్ గుర్తుచేసుకున్నారు. తనను యుద్ధంలో చంపించేందుకు భార్య, మంత్రి కలిసి కుట్ర పన్నారని, అయితే యుద్ధంలో శత్రువులను ఓడించి తిరిగి వచ్చానని తెలిపారు. ఆ తర్వాత వారి మోసాన్ని తెలుసుకుని భార్యతో పాటు మంత్రిని కూడా హతమార్చినట్లు పండితుడు వివరించారని చెప్పారు. తాను పరమ శివభక్తుడినని, ఈ ఘటనల తర్వాత తీవ్ర పశ్చాత్తాపంతో రాజ్యాన్ని విడిచి అడవులకు వెళ్లి ఆహారం లేక ప్రాణాలు విడిచినట్లు చెప్పారని సంజయ్ వెల్లడించారు. గత జన్మలో చేసిన కర్మల ఫలితమే ఈ జన్మలో తన జీవితాన్ని ప్రభావితం చేసిందని ఆయన నమ్ముతున్నారు. గత జన్మలోని శివభక్తి, పుణ్యం వల్ల మంచి కుటుంబంలో పుట్టి, మంచి సినీ కెరీర్ సాధించానని, అదే సమయంలో గత జన్మలో చేసిన హత్యల పాపం వల్ల ఈ జన్మలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నానని చెప్పినట్లు పేర్కొన్నారు. 1981లో 'రాకీ' సినిమాతో వెండితెరకు పరిచయమైన సంజయ్ దత్.. 'ఖల్ నాయక్', 'వాస్తవ్', 'మున్నాభాయ్ ఎంబీబీఎస్', 'లగే రహో మున్నాభాయ్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్నారు.

గోట్ నా తొలి తెలుగు సినిమా: దివ్యభారతి

నవంబర్ 12 (ఈవార్తలు): జబర్దస్త్ ఫేమ్ సుడిగాలి సుధీర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'గోట్' నవంబర్ 12న థియేటర్లలో విడుదలైంది. వేదవ్యాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దివ్యభారతి హీరోయిన్‌గా నటించారు. మహాతేజ క్రియేషన్స్, జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించగా, ఏషియన్ సినిమాస్ సమర్పించింది. సినిమా విడుదల సందర్భంగా హీరోయిన్ దివ్యభారతి ప్రేక్షకులతో



కలిసి థియేటర్‌లో సినిమా చూశారు. అనంతరం తన ఆనందాన్ని సామాజిక మాధ్యమాల్లో వీడియో ద్వారా పంచుకున్నారు. 'ఇది నా మొదటి తెలుగు సినిమా. ప్రేక్షకుల మధ్య ఫస్ట్ డే ఫస్ట్ షో చూడటం ఎంతో ప్రత్యేకమైన అనుభవం. ప్రేక్షకులు సినిమాను ఆస్వాదించడం, వారి నుంచి ప్రేమను పొందడం మాటల్లో చెప్పలేనంత ఆనందాన్నిచ్చింది. ఈ క్షణాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను' అని తెలిపారు. 'గోట్' సినిమా కోసం చిత్రబృందం ఎంతో కష్టపడిందని, అందరూ ప్రేమతో పనిచేశారని చెప్పారు. ప్రేక్షకులంతా థియేటర్లకు వచ్చి సినిమాను చూసి తమ బృందానికి మద్దతు ఇవ్వాలని కోరారు. అందరం కలిసి ఈ సినిమాను సెలబ్రేట్ చేసుకుందామని దివ్యభారతి పేర్కొన్నారు.

నితిన్ 'అలియాస్ రుక్మిణి' షూటింగ్ పూర్తి



నవంబర్ 12 (ఈవార్తలు): హీరో నితిన్ నటిస్తున్న తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి' షూటింగ్ పూర్తయింది. విభిన్న కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నాని సోదరి దీప్తి గంటా నిర్మిస్తున్నారు. నాని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ సినిమాలో నితిన్ సరసన ఆఫియా సయ్యద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయికుమార్, హర్షవర్ధన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇందులో నితిన్ 'కృష్ణ' అనే యువకుడి పాత్రలో సరికొత్త లుక్‌తో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార వీడియోలు, 'రుక్కు రుక్కు రుక్మిణి' పాట ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

నా బాధ ఎవరికి రాకూడదు



నవంబర్ 12 (ఈవార్తలు): తెలుగు ప్రేక్షకులకు 'సుడిగాడు', 'బ్రదర్ ఆఫ్ బొమ్మాలి' సినిమాలతో పరిచయమైన నటి మోనాల్ గజ్జర్ తన ఆరోగ్య పరిస్థితిపై సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. ఇటీవల తాను పాపిల్లరీ థైరాయిడ్ కార్సినోమా అనే థైరాయిడ్ క్యాన్సర్ బారిన పడినట్లు వెల్లడించారు. ఈ విషయం తెలిసిన తర్వాత ధైర్యంగా చికిత్స తీసుకున్నానని, వైద్యుల పర్యవేక్షణలో శస్త్రచికిత్స విజయవంతంగా జరిగిందని తెలిపారు. ప్రస్తుతం కోలుకుంటున్నానని, ఆరోగ్యం మెరుగుపడుతోందని చెప్పారు. మంచి ఆరోగ్యం, ప్రశాంతమైన మనసు కంటే జీవితంలో విలువైనవి ఏమీ లేవని పేర్కొన్నారు. బిజీ జీవనశైలి కారణంగా చాలామంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, తన అనుభవం దీనిని గుర్తు చేసిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ముఖ్యంగా మహిళలు ఆరోగ్యం విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ తీసుకోవాలని కోరారు. తాను అనుభవించిన బాధ మరెవరికీ రాకూడదని మోనాల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.



'టాక్సిక్' రిజల్ట్ కుంగదీసింది

నవంబర్ 12 (ఈవార్తలు): బాలీవుడ్ నటి కియారా అద్వానీ 'టాక్సిక్' సినిమా ఫలితంపై తాజాగా స్పందించారు. సినిమా విడుదలైన మొదటి రోజు భారీ ఓపెనింగ్ కలెక్షన్లు రావడంతో చిత్రబృందం సంతోషించిందని, అయితే ఆ తర్వాత ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించకపోవడం తమను బాధించిందని తెలిపారు. ముఖ్యంగా తొలి వారాంతంలో సినిమా ఫలితం తనను తీవ్ర నిరాశకు గురిచేసిందని చెప్పారు. తన సాధారణ పాత్రలకు భిన్నంగా, కెరీర్‌లోనే సవాల్‌తో కూడిన పాత్రను ఈ సినిమాలో పోషించానని కియారా తెలిపారు. ఆ పాత్రకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు రావడం కొంత ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. పెళ్లి తర్వాత సినిమాల్లో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడంపై వస్తున్న విమర్శల గురించి కూడా ఆమె మాట్లాడారు. తన భర్త, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా ఈ విషయంలో ఎంతో పరిణతితో వ్యవహరించారని చెప్పారు. తాను రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడంపై ఆయన ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని, ఈ విషయాన్ని ఎప్పుడూ చర్చకు కూడా తీసుకురాలేదని వెల్లడించారు. తన వృత్తిపరమైన నిర్ణయాల పట్ల సిద్ధార్థ్‌కు ఎలాంటి వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు.



నవంబర్ 12 (ఈవార్తలు): నటి నిధి అగర్వాల్ మరోసారి వార్తల్లో నిలిచారు. 2024లో విడుదలైన హారర్ థ్రిల్లర్ 'తంత్ర'కు సీక్వెల్‌గా 'తంత్ర 2' తెరకెక్కుతోంది. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై సునీత్ పడోల్కర్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. కొన్ని నెలల క్రితం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది. అయితే తాజాగా నిధి అగర్వాల్ షూటింగ్ విషయంలో పలు డిమాండ్లు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఆమె కారణంగా కొన్ని షూటింగ్ షెడ్యూల్స్ రద్దయ్యాయని, చిత్రీకరణ ప్రణాళికలు దెబ్బతిన్నాయని సినీ వర్గాల్లో కథనాలు వెలువడుతున్నాయి. నిధి వ్యవహారశైలిపై చిత్రబృందం అసంతృప్తిగా ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రస్తుతం 'తంత్ర 2' షూటింగ్ నిలిచిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ప్రాజెక్టులో నిధి కొనసాగుతారా? లేక మరో హీరోయిన్‌ను తీసుకుంటారా? అనే చర్చ మొదలైంది. అయితే ఈ ప్రచారంపై నిధి అగర్వాల్ కానీ, నిర్మాతలు కానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

'ఇడుపు కాయితం'లో
ఒక్కో పాట ఒక్కో అద్భుతం



నవంబర్ 12 (ఈవార్తలు): బన్నీ వాస్, సుకుమార్ తమ నిర్మాణ సంస్థలపై రూపొందిస్తున్న చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రియదర్శి హీరోగా, నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం తాజాగా టీజర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరోయిన్ నాగదుర్గ మాట్లాడుతూ.. సినిమా టీజర్ ప్రేక్షకులకు నచ్చిందని, సినిమా కూడా ఇదే స్థాయిలో ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.



న్యూజిలాండ్‌కు రిషభ్ పంత్

టీమిండియాకు శుభవార్త. గాయం నుంచి కోలుకున్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ న్యూజిలాండ్ పర్యటనకు బయలుదేరాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిహాబిలిటేషన్ పూర్తి చేసుకున్న అతడికి వైద్య బృందం ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇచ్చింది. గురువారం ఉదయం న్యూజిలాండ్‌కు పయనమైన పంత్.. శుక్రవారం వెల్లింగ్టన్‌లో భారత టెస్టు జట్టుతో చేరనున్నాడు. ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన పంత్.. అక్టోబర్ 1 నుంచి 4 వరకు జరిగిన మ్యాచ్‌లో సైడ్ స్ట్రెయిన్ గాయానికి గురయ్యాడు. అక్టోబర్ చివరి వారంలో బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చేరుకుని కోలుకునే ప్రక్రియ ప్రారంభించాడు. ఫిట్‌నెస్ సాధించడంలో ఆలస్యం కావడంతో న్యూజిలాండ్-ఏతో జరిగిన నాలుగు రోజుల మ్యాచ్‌లకు దూరమయ్యాడు. న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌తో పాటు భారత్-ఏ జట్టులోనూ పంత్‌కు చోటు కల్పించారు. అయితే పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే ఆడే అవకాశం ఉంటుందని ముందే స్పష్టం చేశారు. తాజాగా ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావడంతో భారత జట్టుతో చేరేందుకు మార్గం సుగమమైంది. పంత్ రాకతో వికెట్ కీపర్ స్థానం కోసం ధ్రువ్ జురెల్‌తో పోటీ నెలకొంది. భారత్-ఏ కెప్టెన్‌గా వ్యవహరించిన జురెల్.. న్యూజిలాండ్-ఏతో జరిగిన నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఓ సెంచరీ, ఓ అర్ధశతకంతో రాణించాడు. మరోవైపు సాయి సుదర్శన్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో 91, 88 పరుగులు చేయగా, దేవదత్ పడిక్కల్ 199, 80 పరుగులతో ఆకట్టుకున్నాడు. దీంతో తుది జట్టులో ఎవరికి చోటు దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది. వెల్లింగ్టన్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, అన్షుల్ కాంబోజ్‌లతో పంత్ కలవనున్నాడు. వన్డే జట్టు నుంచి విడుదలైన వీరు రెండు టెస్టుల సిరీస్‌కు సిద్ధమవుతున్నారు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పట్టికలో భారత్ ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉంది. 2027 జూన్‌లో జరిగే ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌లో విజయాలు సాధించడం కీలకం.

భారత అంధుల క్రికెట్ జట్టుకు బీసీసీఐ అండ



బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో నవంబర్ 15 నుంచి 20 వరకు జరగనున్న ఆసియాకప్ ఫర్ ది బ్లైండ్-2026 టోర్నీలో పాల్గొనేందుకు భారత అంధుల క్రికెట్ జట్టు బయలుదేరింది. 17 మంది సభ్యులతో కూడిన జట్టు ప్రయాణానికి దిల్లీ నుంచి ఢాకాకు రానుపోను విమాన టికెట్లను బీసీసీఐ సమకూర్చింది. క్రికెట్‌లో ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పించాలన్నదే తమ ఉద్దేశమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. ఆటగాళ్ల శిక్షణ, ఆహారం, ఫిట్‌నెస్, ఫిజియోథెరపీ తదితర ఖర్చులకు సీబీఆర్‌ఈ సంస్థ సహకారం అందించింది. విజయనగరం జిల్లా వంగర మండలం కొప్పరవలస గ్రామానికి చెందిన టి.దుర్గారావు భారత జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డి.వెంకటేశ్వరరావు (పలాస), ఎ.రవి (రాముడువలస, బొబ్బిలి మండలం), ఎ.అశోక్ (గుంటూరు) కూడా ఉన్నారు. భారత్ ఈ నెల 15న శ్రీలంకతో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న పాకిస్థాన్‌తో, 19న బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. ఈ నెల 20న ఫైనల్ జరగనుంది. పదేళ్ల క్రితం టైటిల్ గెలిచిన భారత్ మరోసారి కప్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది.

విదేశీ టీ20 లీగ్‌లపై ఐసీసీ ఆంక్షలు?

ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న టీ20 ఫ్రాంచైజీ లీగ్‌లపై నియంత్రణ పెంచేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సిద్ధమవుతోంది. లీగ్‌ల సంఖ్య పెరిగిపోవడం, అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్‌కు ఆటంకం కలగడం, అవినీతి ఆరోపణలు రావడంతో కొత్త నిబంధనలు తీసుకురావాలని భావిస్తోంది. ఈ మేరకు సమీక్షా కమిటీ చేసిన ప్రతిపాదనలపై బాలిలో జరగనున్న ఐసీసీ త్రైమాసిక సమావేశంలో వివిధ దేశాల క్రికెట్ బోర్డుల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు చర్చించనున్నారు. బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ తమీమ్ ఇక్బాల్ నేతృత్వంలోని ఈ కమిటీలో ఈసీబీ ప్రతినిధి రిచర్డ్ గౌల్డ్, క్రికెట్ ఆస్ట్రేలియాకు చెందిన టాడ్ గ్రీన్‌బర్గ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సభ్యులుగా ఉన్నారు. ఫ్రాంచైజీ లీగ్‌ల నియంత్రణకు సంబంధించి ఈ బృందం పలు కీలక సిఫార్సులు చేసింది.



నాలుగో వన్డేకు అయ్యర్‌కు కెప్టెన్సీ

రాహుల్, కాంబోజ్ దూరం.. జట్టులోకి ఇషాన్ కిషన్, తిలక్ వర్మ

సిరాజ్, కుల్దీప్‌లకు అవకాశం దక్కే ఛాన్స్.. సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో భారత్

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా టీమిండియా నాలుగో మ్యాచ్‌కు సిద్ధమైంది. శుక్రవారం మౌంట్ మాంగనూయిలోని బే ఓవల్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో భారత్‌కు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించనున్నాడు. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టెస్టు సిరీస్ సన్నాహాల కోసం వెళ్లడంతో అయ్యర్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 2-0తో ఆధిక్యంలో ఉంది. నాలుగో మ్యాచ్‌లో గెలిస్తే మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంటుంది.



మూడో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. గిల్ నాయకత్వంలో తొలి మూడు మ్యాచ్‌లకే భారత జట్టును ఎంపిక చేయగా, చివరి రెండు మ్యాచ్‌లకు అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గిల్‌తో పాటు కేఎల్ రాహుల్, అన్షుల్ కాంబోజ్ కూడా నాలుగో వన్డేకు అందుబాటులో ఉండరు. వీరి స్థానాల్లో తిలక్ వర్మ, కుమార్ కుశాగ్ర, యశ్ ఠాకూర్ జట్టులో చేరారు. తొలి మూడు మ్యాచ్‌ల్లో బెంచ్‌కే పరిమితమైన ఇషాన్ కిషన్‌కు ఈసారి తుది జట్టులో



అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. రోహిత్ శర్మతో కలిసి అతడు ఓపెనింగ్ చేసే అవకాశముంది. రాహుల్ స్థానంలో వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా ఇషానే చేపట్టవచ్చు. ఐదో స్థానంలో బ్యాటింగ్ చేసేందుకు తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ మధ్య పోటీ నెలకొంది. ఈ పర్యటనలో తిలక్ ఇప్పటికే టీ20 మ్యాచ్‌లు ఆడాడు. భారత్-ఏ తరఫున న్యూజిలాండ్-ఏతో జరిగిన అనధికారిక టెస్టులో అర్ధశతకం సాధించాడు. గైక్వాడ్‌కు కూడా గతంలో వన్డేల్లో మిడిలార్డర్‌లో ఆడిన అనుభవం ఉంది. మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్ తొలి మూడు వన్డేల్లో తుది జట్టులో చోటు దక్కించుకోలేదు. కాంబోజ్ దూరం కావడంతో వీరిలో ఒకరికి అవకాశం లభించవచ్చు. అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, ఆకిబ్ నబీలలో ఒకరికి విశ్రాంతి ఇస్తే సిరాజ్, కుల్దీప్ ఇద్దరికీ చోటు దక్కే అవకాశం ఉంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టులోనూ పలువురు కీలక ఆటగాళ్లు టెస్టు సన్నాహాల కోసం వన్డే సిరీస్ నుంచి తప్పుకున్నారు. దీంతో ఆ జట్టు కూడా కొత్త కూర్పుతో బరిలోకి దిగనుంది.



అండర్-19 ఆసియాకప్ ఫైనల్లో భారత్

పాక్‌తో తలపడనున్న యువ జట్టు

అండర్-19 ఆసియాకప్-2026లో భారత యువ జట్టు ఫైనల్‌కు చేరింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో ఆఫ్ఘనిస్థాన్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఫైనల్లో పాకిస్థాన్‌తో తలపడేందుకు సిద్ధమైంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. నోమన్ సలార్‌జాయ్ (51), షా ఫైసల్ రహీమీ (51) అర్ధశతకాలతో రాణించారు. సుబ్‌హాన్ జఖైల్ 31 పరుగులు చేశాడు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్ మూడు వికెట్లు పడగొట్టగా, ఆర్యన్ సావ్‌సాని రెండు వికెట్లు తీశాడు. 228 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 36.5 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసి విజయం సాధించింది. కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ 93



పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ 51 పరుగులతో అర్ధశతకం సాధించగా, వీకే వినీత్ 57 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. యశ్‌వర్ధన్ చౌహాన్ 16 పరుగులతో అజేయంగా నిలిచాడు.

భార్యతో కమిన్స్ వాగ్వాదం

ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్, అతడి భార్య బెక్కీ మధ్య సిడ్నీ వీధిలో వాగ్వాదం జరిగినట్లు కనిపిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇద్దరూ కొద్దిసేపు తీవ్రంగా మాట్లాడుకుంటుండగా, బెక్కీ ప్రశ్నలు వేస్తున్నా కమిన్స్ మౌనంగా వింటున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. 2018 నాటి బాల్ టాంపరింగ్ వివాదంపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఈ వీడియో బయటకు రావడం ఆసక్తికరంగా మారింది. ఈ వ్యవహారంపై కమిన్స్ శుక్రవారం మీడియాతో మాట్లాడనున్నట్లు తెలిపాడు. అయితే తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని బెక్కీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పేర్కొంది. 2018లో దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా జరిగిన మూడో టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు బాల్ టాంపరింగ్‌కు పాల్పడ్డారు. ఫీల్డింగ్ చేస్తున్న కెమరూన్ బ్రాన్‌క్రాఫ్ట్ బంతిని శాండ్‌పేపర్‌తో రుద్దుతున్న దృశ్యాలు ప్రత్యక్ష ప్రసారంలో కనిపించాయి. ఈ ఘటనలో అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, బ్రాన్‌క్రాఫ్ట్‌పై నిషేధం విధించారు. ఈ వివాదం 'సాండ్‌పేపర్ గేట్'గా గుర్తింపు పొందింది. తాజాగా తన ఆత్మకథను విడుదల చేసిన ఖవాజా.. బాల్ టాంపరింగ్ గురించి ఆస్ట్రేలియా ఆటగాళ్లందరికీ తెలుసని పేర్కొన్నాడు. రివర్స్ స్వింగ్ రాబట్టేందుకు బంతిని శాండ్‌పేపర్‌తో రుద్దేవారని పుస్తకంలో వివరించాడు. అయితే ఈ వ్యవహారంలో బౌలర్ల పాత్ర గురించి మాత్రం ప్రస్తావించలేదు.



ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో వివాన్ కపూర్‌కు రజతం

ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ వివాన్ కపూర్ రజత పతకం సాధించాడు. పురుషుల ట్రాప్ విభాగంలో అద్భుత ప్రదర్శన చేసిన అతడు స్వర్ణానికి కొద్ది దూరంలో నిలిచాడు. ఈ విజయంతో 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు భారత్‌కు కోటా స్థానం దక్కేలా చేశాడు. గురువారం జరిగిన ఫైనల్లో వివాన్, కువైట్ షూటర్ అబ్దుల్ రహమాన్ అల్‌ఫైహాన్ చెరో 29 పాయింట్లు సాధించి సమంగా నిలిచారు. దీంతో విజేతను నిర్ణయించేందుకు షూటాఫ్ నిర్వహించారు. ఇందులో అల్‌ఫైహాన్ 3-2 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. వివాన్ రజతంతో సరిపెట్టుకున్నాడు.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
శుక్రవారం 13-11-2026, జగిత్యాల
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

పాలకులెప్పుడు మేల్కొనేదెప్పుడు

వాతావరణ మార్పులు ఇక భవిష్యత్తులో ఎదురుకాబోయే సమస్యలు కావు. ఇప్పటికే ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను, వ్యవసాయ రంగాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న వాస్తవం. ఒకవైపు కరువులు, మరోవైపు వరదలు, తీవ్రమైన వేడిగాలులు, అడవుల్లో కార్చిచ్చులు, సముద్ర మట్టాల పెరుగుదల ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో టర్కీలోని అంటాల్యాలో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు కాప్31 ప్రాధాన్యం సంతరించుకుంది. నవంబర్ 12న వెలువడిన పరిణామాలు చూస్తే ప్రపంచ దేశాల మధ్య వాతావరణ మార్పుల నియంత్రణపై ఏకాభిప్రాయం ఇంకా దూరంగానే ఉన్నట్లు స్పష్టమవుతోంది. చిన్న ద్వీప దేశాలు, వాతావరణ మార్పుల ప్రభావానికి ఎక్కువగా గురవుతున్న దేశాలు తక్షణ చర్యలు తీసుకోవాలని పెద్ద ఆర్థిక వ్యవస్థలను కోరుతున్నాయి. సముద్ర మట్టాలు పెరిగితే తమ భూభాగాలే ప్రమాదంలో పడతాయని ఆ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు గతంలో అధికంగా కర్బన ఉద్గారాలకు కారణమైనప్పటికీ, వాటి ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నది పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలే. అందువల్ల వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు అవసరమైన నిధులను సంపన్న దేశాలు సమకూర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల కార్యనిర్వాహక కార్యదర్శి సైమన్ స్టీల్ నవంబర్ 11న చేసిన ప్రసంగంలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల గతంలో అంచనా వేసిన నాలుగు డిగ్రీలకు పైగా స్థాయి నుంచి సుమారు 2.6 డిగ్రీల స్థాయికి తగ్గే దిశగా అంతర్జాతీయ సహకారం కొంత ఫలితాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే పారిస్ ఒప్పందం నిర్దేశించిన 1.5 డిగ్రీల లక్ష్యానికి చేరువ కావడానికి ప్రస్తుత చర్యలు సరిపోవడం లేదని హెచ్చరించారు. కర్బన ఉద్గారాల తగ్గింపు వేగం పెరగాలని, వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనే దేశాలకు మరింత సహాయం అందాలని స్పష్టం చేశారు. ఇక్కడే ప్రపంచ దేశాల ద్వంద్వ వైఖరి బయటపడుతోంది. ఒకవైపు పర్యావరణ పరిరక్షణ గురించి ప్రసంగాలు, మరోవైపు శిలాజ ఇంధనాల వినియోగాన్ని కొనసాగించాలన్న పట్టుదల. చమురు, బొగ్గు, సహజ వాయువు ఆధారిత ఆర్థిక వ్యవస్థల నుంచి బయటపడటానికి చాలా దేశాలు సిద్ధంగా లేవు. వెనిజులా వంటి చమురు ఉత్పత్తి దేశాలు తమ ఇంధన వనరులను వినియోగించుకునే సార్వభౌమ హక్కును సమర్థిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు కూడా తమ ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగానే పర్యావరణ విధానాలను అమలు చేస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. అయితే శక్తి అవసరాలను విస్మరించి ఒక్కసారిగా సంప్రదాయ ఇంధనాలను నిలిపివేయడం కూడా సాధ్యం కాదు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు పరిశ్రమలు, రవాణా, విద్యుత్తు, వ్యవసాయం కోసం నిరంతర ఇంధన సరఫరా అవసరం. కాబట్టి వాతావరణ పరిరక్షణ పేరుతో పేద దేశాల అభివృద్ధిని అడ్డుకోకుండా, అందుబాటులో ఉండే ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించాలి. సౌర, పవన, జలవిద్యుత్తు రంగాల్లో పెట్టుబడులు పెంచాలి. పర్యావరణ అనుకూల సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలి. సంపన్న దేశాలు ఆర్థిక సహాయంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా పంచుకోవాలి.



నకిలీ కోర్టు ఉత్తర్వులు డిజిటల్ స్వేచ్ఛకు ముప్పు!

ప్రజాస్వామ్యంలో న్యాయస్థానాలకు అత్యున్నత గౌరవం ఉంటుంది. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వ యంత్రాంగం అమలు చేయడం సహజం. కానీ న్యాయస్థానం అసలు ఇవ్వని ఉత్తర్వుల ఆధారంగా ప్రభుత్వ శాఖలు చర్యలు తీసుకుంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారుతుందో నవంబర్ 12న వెలుగులోకి వచ్చిన ఓ పరిణామం స్పష్టం చేస్తోంది. నకిలీ న్యాయస్థాన ఉత్తర్వుల ఆధారంగా 129 బెట్టింగ్ వెబ్‌సైట్లను నిలిపివేయాలని టెలికం అధికారుల నుంచి ఇంటర్నెట్ సేవల సంస్థలకు ఆదేశాలు వెళ్లినట్లు రాయిటర్స్ పరిశోధన వెల్లడించింది.

రాజస్థాన్, అలహాబాద్ హైకోర్టుల పేర్లతో నకిలీ పత్రాలను పంపించి ఈ ఆదేశాలు పొందినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టడం, ఉత్తరప్రదేశ్ సైబర్ నేరాల పోలీసులు దర్యాప్తు ప్రారంభించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఇది కేవలం కొన్ని బెట్టింగ్ వెబ్‌సైట్లకు సంబంధించిన వివాదం కాదు. ప్రభుత్వ వ్యవస్థల్లో ధ్రువీకరణ ప్రక్రియ ఎంత బలహీనంగా ఉందన్నదానికి ఇది నిదర్శనం. న్యాయస్థానం పేరు, చిహ్నం, ముద్ర, క్యూఆర్ సంకేతం ఉన్న పత్రం వచ్చిందంటే అది నిజమైన ఉత్తర్వేనని భావించి అమలు చేయడం ఎంతవరకు సమంజసం? ఒక ఉత్తర్వు నిజంగా న్యాయస్థానం నుంచి వచ్చిందా లేదా అన్నది నిర్ధారించుకోవడానికి కనీస వ్యవస్థ కూడా లేకపోవడం ఆందోళనకరం. ఇంటర్నెట్ నేటి జీవితంలో విడదీయలేని భాగమైంది. విద్యార్థుల చదువు నుంచి వ్యాపార లావాదేవీల వరకు, వైద్య సేవల నుంచి ప్రభుత్వ పథకాల దరఖాస్తుల వరకు ప్రతి రంగం డిజిటల్ వేదికలపై ఆధారపడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏదైనా వెబ్‌సైట్ లేదా వేదికను నిలిపివేయడం అంటే కేవలం ఒక సాంకేతిక చర్య కాదు. దాని ద్వారా ఉపాధి పొందుతున్నవారు, సేవలు వినియోగించుకుంటున్నవారు, వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్నవారు ప్రభావితమవుతారు. ప్రభుత్వ చర్య వల్ల ఒక సంస్థకు ఆర్థిక నష్టం కలగవచ్చు. పౌరుల సమాచారానికి, వారి హక్కులకు సంబంధించిన సమస్యలు కూడా తలెత్తవచ్చు. నిజానికి బెట్టింగ్, అక్రమ జూదం, మోసపూరిత ఆన్‌లైన్ కార్యకలాపాలను అరికట్టడం ప్రభుత్వ బాధ్యతే. అలాంటి వేదికలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. కానీ అక్రమాలను అరికట్టాలన్న లక్ష్యం ఉన్నంత మాత్రాన ఏ పద్ధతినైనా అనుసరించవచ్చని భావించకూడదు. చట్టబద్ధమైన ప్రక్రియను పాటించడం కూడా అంతే ముఖ్యం. ఒకవైపు అక్రమ వేదికలపై చర్యలు తీసుకుంటూ, మరోవైపు నకిలీ ఉత్తర్వుల ఆధారంగా చట్టబద్ధమైన వెబ్‌సైట్లు కూడా నిలిచిపోయే పరిస్థితి రాకూడదు. ఈ ఘటనలో అసలు ప్రశ్న ప్రభుత్వ వ్యవస్థలోని బాధ్యతాయుతమైన అధికారుల పనితీరుపై ఉంది. న్యాయస్థానం ఉత్తర్వును పరిశీలించడానికి సంబంధిత కోర్టు రిజిస్ట్రీని సంప్రదించారా? ఉత్తర్వు సంఖ్య, తేదీ, ధర్మాసనం వివరాలు ధ్రువీకరించారా? అధికారిక డిజిటల్ ప్రతిని పరిశీలించారా? ఒక ఈమెయిల్ ద్వారా వచ్చిన పత్రాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని ఇంత కీలకమైన నిర్ణయం ఎలా తీసుకున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాలి. అలహాబాద్ హైకోర్టు తన పేరుతో ప్రచారంలో ఉన్న ఓ ఉత్తర్వు తాము జారీ చేయలేదని స్పష్టం చేసింది. దీంతో నకిలీ పత్రాల వ్యవహారం మరింత తీవ్రతను సంతరించుకుంది. సంబంధిత శాఖ వెబ్‌సైట్‌లో ఆ పత్రాలు, ఉత్తర్వుల సమాచారానికి సంబంధించిన వివరాలు గురువారం నాటికీ ఉన్నాయని కథనం పేర్కొంది. వాటిని ఎలా అప్‌లోడ్ చేశారు? ఎవరు పరిశీలించారు? ఎవరి అనుమతితో ఆదేశాలు అమలయ్యాయి? అన్న విషయాలను దర్యాప్తులో తేల్చాలి. డిజిటల్ నియంత్రణ అవసరమే. కానీ నియంత్రణకు పారదర్శకత, జవాబుదారీతనం జత కావాలి. వెబ్‌సైట్లను నిలిపివేసే ముందు తప్పనిసరి ధ్రువీకరణ, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన ప్రత్యేక విధానం, సంబంధిత సంస్థలకు అప్పీల్ చేసుకునే అవకాశం, పొరపాటు జరిగినప్పుడు తక్షణ పునరుద్ధరణ వంటి చర్యలు ఉండాలి. ప్రభుత్వ ఆదేశాలపై స్వతంత్ర సమీక్షకు కూడా అవకాశం కల్పించాలి. ఇకపై న్యాయస్థానాల పేరుతో వచ్చే ప్రతి ఉత్తర్వును అధికారిక న్యాయవ్యవస్థ వ్యవస్థల ద్వారా ధ్రువీకరించే విధానం తీసుకురావాలి. అధికారుల నిర్లక్ష్యం వల్ల తప్పు జరిగితే బాధ్యతను నిర్ణయించాలి. నకిలీ పత్రాలు తయారు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి. ప్రభుత్వానికి అధికారం ఉందని ప్రజల డిజిటల్ హక్కులను నిర్లక్ష్యం చేయకూడదు. చట్టాన్ని కాపాడాల్సిన వ్యవస్థే ధ్రువీకరించని పత్రాల ఆధారంగా వ్యవహరిస్తే ప్రజలకు న్యాయవ్యవస్థపై, పాలనా యంత్రాంగంపై విశ్వాసం ఎలా ఉంటుంది? సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ నకిలీ పత్రాల తయారీ సులభమవుతోంది. అందుకే ప్రభుత్వ వ్యవస్థల్లోనూ అంతే ఆధునికమైన ధ్రువీకరణ విధానాలు అవసరం.



రామస్వామి చింత, మహబూబ్‌నగర్

సామాజిక సమానత్వం గురించి ఎంతగా మాట్లాడుకున్నా ఆర్థిక స్వావలంబన లేకుండా అది సంపూర్ణం కాదు. తరతరాలుగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించకుండా సమాజంలో సమాన అభివృద్ధి సాధ్యం కాదు. ముఖ్యంగా మహిళలు, దళితులు, గిరిజనులు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టడానికి ఎదుర్కొంటున్న అడ్డంకులను తొలగించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్టాండ్‌అప్ ఇండియా పథకాన్ని మరో ఐదేళ్లు పొడిగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నవంబర్ 11న కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ పథకం 2031 మార్చి 31 వరకు కొనసాగనుంది. అదనంగా కనీసం 2.5 లక్షల మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలన్నది లక్ష్యం. ఇందుకోసం రూ.4,111 కోట్ల రుణ హామీ నిధికి ఆమోదం తెలిపింది.



మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

2016 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 2.75 లక్షల మందికి పైగా మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కొత్త వ్యాపారాలను ప్రారంభించాలనుకునేవారికి రూ.10 లక్షలకు పైగా, రూ.కోటి వరకు రుణాలు పొందే అవకాశం ఉంది. తయారీ, సేవలు, వాణిజ్యం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో కొత్త సంస్థలను స్థాపించేందుకు ఈ రుణాలు ఉపయోగపడతాయి. ప్రాజెక్టు వ్యయంలో 85 శాతం వరకు రుణ సహాయం అందించే వెసులుబాటు కూడా ఉంది. ఈ పథకం ఉద్దేశం కేవలం రుణాలు ఇవ్వడం కాదు. వ్యాపార రంగంలో సామాజికంగా వెనుకబడిన వర్గాల భాగస్వామ్యాన్ని పెంచడం. సంప్రదాయంగా పెద్ద పెట్టుబడులు, వ్యాపార సంబంధాలు, ఆర్థిక వనరులు కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయి. సామాజికంగా వెనుకబడిన కుటుంబాల్లో ప్రతిభ, ఆలోచనలు, వ్యాపార సామర్థ్యం ఉన్నప్పటికీ ఆర్థిక వనరులు లేక చాలామంది ముందడుగు వేయలేకపోతున్నారు. బ్యాంకు రుణాలు పొందేందుకు అవసరమైన హామీలు, ఆస్తులు, అనుభవం లేకపోవడం కూడా వారికి అడ్డంకిగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక రుణ సదుపాయం కల్పించడం మంచి నిర్ణయమే. అయితే రుణం మంజూరు కావడమే విజయంగా భావించకూడదు. వ్యాపారం ప్రారంభించడం ఒక దశ అయితే దానిని నిలబెట్టుకోవడం మరో పెద్ద సవాలు. మార్కెట్‌పై అవగాహన, ముడిసరుకు లభ్యత, నైపుణ్యం కలిగిన సిబ్బంది, ఉత్పత్తులకు గిరాకీ, రవాణా, ప్రచారం, సాంకేతిక పరిజ్ఞానం వంటి అనేక అంశాలు వ్యాపార విజయాన్ని నిర్ణయిస్తాయి. ఇవేవీ తెలియకుండా రుణం తీసుకున్నవారు కొంతకాలానికే అప్పుల భారంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఈ పథకం ప్రయోజనాలు చేరాలంటే బ్యాంకుల పాత్ర కీలకం. దరఖాస్తు ప్రక్రియను సరళీకరించాలి. అవసరమైన పత్రాల పేరుతో లబ్ధిదారులను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదు. అర్హత ఉన్నప్పటికీ సామాజిక నేపథ్యం, ఆర్థిక పరిస్థితుల కారణంగా రుణాలు నిరాకరించే పరిస్థితులు రాకూడదు. రుణ మంజూరు ప్రక్రియలో పారదర్శకత ఉండాలి. దరఖాస్తుల సంఖ్య, ఆమోదించిన రుణాలు, తిరస్కరణలకు కారణాలు, ప్రాంతాలవారీగా లబ్ధిదారుల వివరాలను బహిరంగంగా వెల్లడించాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడే అవకాశం ఉంది. ఆహార శుద్ధి పరిశ్రమలు, పాడి పరిశ్రమ, పశుపోషణ, చిన్న తయారీ సంస్థలు, గ్రామీణ సేవా రంగాల్లో మహిళలు, దళిత, గిరిజన యువతకు అవకాశాలు ఉన్నాయి. గ్రామాల్లోనే ఉపాధి కల్పించే చిన్న పరిశ్రమలు ఏర్పడితే పట్టణాలకు వలసలు తగ్గుతాయి. స్థానికంగా ఉత్పత్తి, ఆదాయం, ఉపాధి పెరుగుతాయి. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను వ్యక్తిగత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించవచ్చు. ఇందుకోసం రుణంతోపాటు శిక్షణ, వ్యాపార ప్రణాళిక తయారీ, లెక్కల నిర్వహణ, మార్కెటింగ్, డిజిటల్ చెల్లింపులు, ప్రభుత్వ కొనుగోళ్లలో భాగస్వామ్యం వంటి అంశాల్లో నిరంతర సహకారం అందించాలి. ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమల సమాఖ్యలు, బ్యాంకులు కలిసి మార్గదర్శక కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కొత్తగా వ్యాపారం ప్రారంభించినవారికి తొలి మూడేళ్లు ప్రత్యేకంగా చేయూతనివ్వాలి. వ్యాపారం విఫలమైతే దాని కారణాలను పరిశీలించి, తిరిగి నిలదొక్కుకునే అవకాశాలు కల్పించాలి. మహిళలకు రుణం ఇచ్చి వారి పేరుతో వ్యాపారాన్ని కుటుంబంలోని ఇతరులు నిర్వహించే పరిస్థితి రాకుండా చూడాలి. వాస్తవంగా మహిళలే యజమానులుగా, నిర్ణయాధికారులుగా ఉండాలి. దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు మార్కెట్‌లో సమాన అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ కొనుగోళ్లలో వారికి తగిన ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలి. సామాజిక న్యాయం అనేది కేవలం రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలతోనే పరిపూర్ణం కాదు. ఆర్థిక వనరులపై అందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుంది. స్టాండ్‌అప్ ఇండియా పథకం పొడిగింపు ఆ దిశగా మరో అవకాశం. అయితే ఈ అవకాశాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత కేంద్రం, రాష్ట్రాలు, బ్యాంకులు, పరిశ్రమలపై ఉంది.

- విద్యారాణి వూరడి

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.